


పాలన అంటే బటన్లు నొక్కడం కాదు.. ప్రజలకు తమ కాళ్ల మీద నిలబడే శక్తిని అందించడం. చేపలు పెట్టడం కాదు.. పట్టాలన్న కార్ల్ మార్క్స్ చెప్పిన మాటల్ని చంద్రబాబు పదేపదే చెబుతారు. ఈ ప్రభుత్వం అదే విధంగా పనిచేస్తోంది. సంక్షేమాన్ని విస్మరించలేదు,సంక్షేమాన్ని ప్రారంభించిన ఎన్టీఆర్ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తున్నాం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


శనివారం 07.03.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 319 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## 'వికసిత్ భారత్'తోనే భావితరాల భవిష్యత్





- ఆత్మనిర్భర్- వికసిత్ భారత్ సంకల్పంపై తీర్మానానికి శాసనసభ ఆమోదం
- అభివృద్ధికి అవరోధంగా ఉన్న చట్టాల రద్దు
- 13 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ పై త్వరలో నిర్ణయం
- ఫ్యాక్షనిజం, నక్సలిజం పోయి..రప్పా రప్పా రాజకీయం వచ్చింది
- నాడు ప్రభువా క్షమించు అన్న జగన్..కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేసి ఏడుకొండల వాడిని క్షమాపణ అడగలేదేం
- 5 కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అసెంబ్లీలో చర్చలు, నిర్ణయాలు
- ప్రజాప్రతినిధులు వ్యక్తిగత ప్రవర్తనతో ప్రభుత్వానికి ఇబ్బందులు తేవొద్దు
- ద్రవ్య వినిమయ బిల్లు సహా వివిధ అంశాలపై శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం

2 లో



## స్వదేశీ ఆత్మ గౌరవం... బీజేపీ సంకల్పం

- అసెంబ్లీ వేదికగా స్వదేశీ ఉత్పత్తుల వినియోగంపై బీజేపీ ఉద్యమం
- స్వదేశీ కిట్‌ల పంపిణీతో ఎమెల్యేలు,ఎమ్మెల్సీలలో బీజేపీ చైతన్యం
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దేశీయ ఉత్పత్తుల ప్రాముఖ్యత వివరించిన బీజేపీ
- దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి స్వదేశీ ఉత్పత్తుల వినియోగం ఎంతో అవసరం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రాంగణం శుక్రవారం బీజేపీ నేతల సందడితో కళకళలాడింది. స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముందుండి చేపట్టిన కార్యక్రమం సభా ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి ఒక్క ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని ఆత్మీయంగా పలకరించి స్వదేశీ వస్తువులతో కూడిన కిట్‌లను అందజేస్తూ దేశీయ ఉత్పత్తుల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ చొరవను పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి సమావేశాల సందర్భంగా స్వదేశీ వస్తువుల ఉత్పత్తి, వినియోగాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో పీవీఎన్ మాధవ్ నేతృత్వంలోని బీజేపీ ప్రతినిధులు ప్రజాప్రతినిధులకు 12 రకాల స్వదేశీ వస్తువులతో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం శాసనసభ పరిసరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి స్వదేశీ ఉత్పత్తుల వినియోగం ఎంతో అవసరమనే భావనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బీజేపీ నేతలు తెలిపారు. మిగతా 2లో...





## ప్రాజెక్టుల నిర్మాణ నాణ్యతలో రాజీ లేదు



- పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు కేంద్రానికి తెలియచేయండి
- ప్రాధాన్యతల వారీగా ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టాలి
- ప్రాజెక్టులకు ఇవ్వాల్సిన నిధులపై ఆర్థిక శాఖ రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలి
- ప్రాజెక్టుల నిర్మాణాలు సుదీర్ఘ కాలం ఎన్నికల హామీలుగా మిగలకూడదు

ఇరిగేషన్ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాల్లో నాణత్య పాటించే అంశంపై రాజీ పడే ప్రసక్తే ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణాలు చేసే క్రమంలో ప్రజా భద్రత ముఖ్యమనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంపై శుక్రవారం అసెంబ్లీలోని తన ఛాంబర్లో సీఎం చంద్రబాబు సమీక్షించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీ-నీవా, పోలవరం-నల్లమల సాగర్ లింక్, చింతలపూడి లిఫ్ట్, వరికపూడిశెల లిఫ్ట్, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల ప్రగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. వివిధ ప్రాజెక్టులకు చేపట్టాల్సిన పునరావాస పనుల పైనా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..." మిగతా 3లో...

## తల్లికి వందనం పథకం... రూ.8,454 కోట్ల పంపిణీ



- అర్హులందరికీ సాయం అందించాలనేది ప్రజా ప్రభుత్వ నిర్ణయం
- వైసీపీ హయాంలో 52శాతం మంది విద్యార్థులకే సాయం
- కూటమి ప్రభుత్వంలో 85శాతం మంది విద్యార్థులకు సాయం అందించాం
- శాసనమండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

2 లో

## బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్‌ల పంపిణీ

రాష్ట్రంలో 7వ తరగతి నుంచి 12వ తరగతి బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్‌ల పంపిణీ

గత ప్రభుత్వంలో రూ.18.96 కోట్ల బకాయిలను ప్రజా ప్రభుత్వం చెల్లించింది

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తాం

శాసనమండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

2 లో

## మెస్ ఛార్జీలు పెంచుతున్నాం



- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బీసీ హాస్టళ్లలో మెస్ ఛార్జీలు పెంచే ఆలోచన చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో విద్యనభ్యసించే బీసీ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె స్పందిస్తూ, బీసీ హాస్టళ్లలో చదవే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. 2014-19లో తరగతల వారీగా మెస్ ఛార్జీలు పెంచిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. మిగతా 2లో...

## సివిల్స్‌లో మెరిసిన తెలుగు తేజాలు




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** యూపీఎస్సీ సివిల్స్ పరీక్షల్లో తెలుగు వాళ్లు సత్తా సాటించారు. ఏపీ, తెలంగాణ నుంచి మంచి సివిల్స్ రాసిన 17 మంది మంచి ర్యాంకులు సాధించారు. గూడెల్లి సృజనకు 55వ ర్యాంకు రాగా డీఎస్‌కే ప్రచేత్‌కు 193వ ర్యాంకు, ఎస్.వర్షిత్‌రెడ్డికి 259వ ర్యాంకు, ఎం.పవన్‌కుమార్‌రెడ్డికి 297వ ర్యాంకు, వెలిమినేటి విక్రమసింహారెడ్డికి 541వ ర్యాంకు, గుమ్మల శ్వేతకు 573వ ర్యాంకు, పల్లి ప్రమోద్ విష్ణుకు 640వ ర్యాంకు, వెలిమినేటి విజయసింహారెడ్డికి 682వ ర్యాంకు, పోతుపురెడ్డి భార్గవ్‌కు 738వ ర్యాంకు, పుదారి రాహుల్‌కు 748వ ర్యాంకు, కుమ్మరి శ్రవణ్‌కుమార్‌కు 768వ ర్యాంకు, కత్తిమాని అనిరుధ్‌కు 786వ ర్యాంకు, కోరపోతుల శ్రీకర్‌రాజుకు 806వ ర్యాంకు, ఇస్లావత్ శ్రీరామ్ హర్షకు 823వ ర్యాంకు, కట్టా ప్రత్యూషకు 908వ ర్యాంకు, గోగుల రాజశేఖర్‌కు 920వ ర్యాంకు, గుగులోతు జితేందర్ నాయక్‌కు 939వ ర్యాంకు సాధించారు. దీంతో వీరిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తోటి స్నేహితులు, బంధవులు విషెస్ చెబుతున్నారు.

కాగా అఖిల భారత సర్వీసుల్లో మొత్తం 1087 ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ ఉద్యోగాల భర్తీకి Upsc సివిల్స్ పరీక్ష నిర్వహించింది. తాజాగా ఈ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. మొత్తం 958 మందిని ఎంపిక చేసింది. టాప్ 100లో తెలుగమ్మాయి సృజన 55వ ర్యాంకు సాధించారు.

## 20 నెలల్లో 9వేల నియామకాలు



- ప్రభుత్వంపై ఏటా రూ.350 కోట్ల ఆర్థిక భారం
- పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎప్పటికప్పుడు పోస్టుల భర్తీ
- జీవనశైలి విధానంలో వస్తున్న మార్పులతో పెరుగుతున్న అసంక్రమిత వ్యాధులు
- ముందస్తు జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- ఎన్ సిడి క్లినిక్ ల్లో పనిచేసేందుకు నియమించిన వైద్యులకు మంత్రి పిలుపు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గడచిన 20 నెలల్లో దాదాపు 9,000 నియామకాలు కూటమి ప్రభుత్వం చేపట్టిందని, ఇందులో 2000 మంది వైద్యులు, 5,800 మంది ఇతర పారా మెడికల్ ఉద్యోగులు, 1200 మంది ఆశా వర్కర్లు ఉన్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. సగటున నెలకు 450 చొప్పున పోస్టులను భర్తీచేశామని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వంపై ఏడాదికి రూ. 350కోట్ల వం-కు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. రోగులకు ఉచిత వైద్య సేవలు మరింత మెరుగ్గా అందించాలన్న లక్ష్యంలో భాగంగా జీరో వేకెన్సీ విధానం కింద ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత వైకాపా పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన ఆయుష్ వైద్యానికి పూర్వ వైభావాన్ని తీసుకువచ్చే క్రమంలో భాగంగా 75 వైద్యుల పోస్టుల భర్తీతోపాటు పారా మెడికల్, ఇతర కేటగిరిల్లో కలిపి 358 మంది పోస్టులను భర్తీచేస్తున్నామని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ శాఖను కూడా బలోపేతం చేసే చర్యల్లో భాగంగా - 2లో...

## జనగణన చిహ్నాల ఆవిష్కరణ



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న 2027 జనాభా లెక్కల సేకరణ ప్రక్రియలో భాగంగా హోంమంత్రి అమిత్ షా గురువారం ప్రగతి, వికాస్ పేరుతో రెండు జనగణన చిహ్నాలను ఆవిష్కరించారు. స్త్రీ, పురుష జనగణకులను ప్రతిబింబించేలా వీటిని రూపొందించారు. "ఈ చిహ్నాలు 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో స్త్రీ, పురుషుల సమాన భాగస్వామ్యానికి ప్రతీకలు. వీటి ద్వారా జనగణన-2027కు సంబంధించిన కీలక లక్ష్యాలను, సమాచారాన్ని సమాజంలోని ప్రతివర్గానికీ చేరవేస్తాం" అని అధికారిక ప్రకటన పేర్కొంది. 2027 జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన సమాచారాన్ని వీటి సాయంతో ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేస్తారు.

తొలిసారి డిజిటల్ రూపంలో సేకరించనున్న లెక్కల కోసం సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడాక్) రూపొందించిన డిజిటల్ సాధనాలను కూడా అమిత్‌షా ఈ సందర్భంగా విడుదల చేశారు. ఉపగ్రహ దృశ్యాల సాయంతో డిజిటల్ మ్యాపింగ్‌కు సహాయపడే మిగతా 2లో...

## ఏపీలో అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్కుల ఏర్పాటు



- శాసనసభలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రపంచ స్థాయి వినోద సౌకర్యాలు,థీమ్ పార్కుల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శాసనసభలో స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టిచెరుకూరు మండలం కర్నూతల గ్రామంలోని 171.14 ఎకరాల విస్తీర్ణంలో డిస్నీ వరల్డ్ తరహా ప్రాజెక్టును ఏర్పాటు చేసే ప్రతిపాదనపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అడిగిన ప్రశ్నకు మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ డిస్నీ వరల్డ్ లేదా యూనివర్సల్ స్టూడియోస్ వంటి భారీ ప్రాజెక్టులకు రూ. 35,000 కోట్ల నుండి రూ. 60,000 కోట్ల వరకు పెట్టుబడి అవసరమవుతుందని పేర్కొన్నారు. ఇటువంటి ప్రాజెక్టులను ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్ సంస్థలే నిర్వహిస్తాయని, ప్రభుత్వం కేవలం భూమి కేటాయింపు, అనుమతులు, రాయితీలు మాత్రమే కల్పిస్తుందని వివరించారు. ప్రస్తుతం భారతదేశంలో పర్యాటకుల సగటు ఖర్చు చేసే సామర్థ్యం (రూ. 20,000-21,000) అంతర్జాతీయ ప్రమాణాల కంటే తక్కువగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో వీటిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా డిస్నీ వరల్డ్ మరియు యూనివర్సల్ స్టూడియోస్ వంటివి యూఎస్ఏలోని ఓర్లాండో, లాస్ ఏంజిల్స్, జపాన్ లోని టోక్యో, ఫ్రాన్స్ లోని పారిస్,చైనాలోని షాంఘై వంటి మెట్రో పాలిటన్ నగరాల్లో ఉన్నాయని ఈ సందర్భంగా వివరించారు. వీటి ఏర్పాటు డిమాండ్, సప్లైల మీద ఆధారపడి ఉంటుందన్నారు. ఆయా దేశాల్లో రిటర్న్ ఉన్నాయి కాబట్టి వాటి ఏర్పాటుకు ఆస్కారం ఉందన్నారు. మన దేశంలో ఏర్పాటు చేయాలంటే పర్యాటకుల రాక, వారి ఖర్చు చేసే సామర్థ్యం ఎక్కువగా ఉండాలని స్పష్టం చేశారు. మిగతా 2లో...

## తల్లికి వందనం పథకం...
# రూ.8,454 కోట్ల పంపిణీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తల్లికి వందనం పథకం కింద రాష్ట్రంలో 67,01,653 మంది విద్యార్థులకు రూ.8,454 కోట్ల మేర సాయం అందించాం. అర్హులందరికీ సాయం అందించాలనేది ప్రజా ప్రభుత్వ నిర్ణయమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం, యూడైస్ ప్రకారం రాష్ట్రంలో నమోదైన విద్యార్థుల సంఖ్యపై శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. యూడైస్ ప్రకారం ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు రాష్ట్రంలో 79,51,903 మంది విద్యార్థులు నమోదయ్యారు. తల్లికి వందనం పథకం కింద రూ.8,454 కోట్లు సాయం అందించాం. 67,01,653 మందికి తల్లికి వందనం వర్తించింది. యూడైస్ లో 86 లక్షల మంది విద్యార్థులు ఉన్నారంటూ వైసీపీ నేతలు అసత్యాలు మాట్లాడుతున్నారు. యూడైస్ లో నమోదైన వారిలో అర్హులందరికీ(84.27%)సాయం అందించాం.

వైసీపీ హయాంలో యూడైస్ కింద 81,72,224 మంది విద్యార్థులు నమోదై ఉంటే.. కేవలం 42,33,098 మందికి మాత్రమే, అంటే 52శాతం మందికి మాత్రమే ఇచ్చారు. మేం 85శాతం మందికి సాయం అందించాం. 2020-21 చూస్తే సుమారుగా 83 లక్షల మంది ఉంటే.. కేవలం 44 లక్షల మందికే ఇచ్చారు. 2021-22లో 82 లక్షల మంది ఉంటే.. కేవలం 43 లక్షల మందికే ఇచ్చారు. 2022-23లో 80 లక్షల మంది ఉంటే.. కేవలం 42 లక్షల మందికే ఇచ్చారు. వైసీపీ హయాంలో 52శాతం మంది విద్యార్థులకు ఇస్తే.. ప్రజా ప్రభుత్వంలో 84.27 శాతం మందికి అందజేశాం. తల్లికి వందనం పథకం కింద సాయం అందని వారి వివరాలు పంపిస్తే.. సరిచేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. అర్హులందరికీ సాయం అందించాలనేది ప్రజా ప్రభుత్వ నిర్ణయం.

కొంతమందికి పాక్షిక సాయం అందించారనే విషయంలో.. సోషల్ వెల్ఫేర్ విభాగంలో కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంది. మేం ముందు చెల్లించిన తర్వాత కేంద్రం నిధులు అందజేస్తోంది. రెండూ కలిసికట్టుగా మేం అందిస్తున్నాం. గ్యాప్ ఏమైనా ఉంటే వివరాలు ఇవ్వాలి. పారిశుద్ధ్య కార్మికులందరికీ తల్లికి వందనం వర్తించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

# మెస్ ఛార్జీలు పెంచుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

3,4 తరగతులకు 33 శాతం ఛార్జీలు, 5-7 తరగతి పిల్లలకు 67 శాతం, 8-10 తరగతి విద్యార్థులకు 47 శాతం, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు 33 శాతం మేర మెస్ ఛార్జీలు పెంచామన్నారు. బీసీ హాస్టళ్ల మెస్ ఛార్జీల పెంపు ఆలోచన కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇదే విషయమై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో చర్చించినట్లు తెలిపారు. హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఏ రకమైన పోషకాహారం అందించాలనే విషయమై న్యూట్రిషన్ నిపుణులతో చర్చిస్తున్నామన్నారు. దానికి అనుగుణంగా మెస్ ఛార్జీల పెంపు ఆలోచన చేస్తున్నామని మంత్రి సవిత స్పష్టం చేశారు.

# జనగణన చిహ్నాల ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

హౌస్‌లిస్టింగ్ బ్లాక్ క్రియేటర్ (హెచ్ఎల్‌బీసీ)తో పాటు గృహ జాబితా సమాచారాన్ని సేకరించి అప్‌లోడ్ చేసేందుకు ఉపయోగపడే ఆఫ్‌లైన్ మొబైల్ యాప్.. 'హెచ్ఎల్ఓ'ను హోం మంత్రి ప్రారంభించారు.

ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా సమర్పించేందుకు ఉపయోగపడే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (ఎస్ఈ)పోర్టల్‌ను, జనగణనకు సంబంధించిన పరిపాలనా పరమైన పర్యవేక్షణకు సాయపడే సెన్సస్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టంను కూడా అమిత్‌షా ఆవిష్కరించారు. జనాభా లెక్కల సేకరణలో తొలి దశ అయిన హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ వచ్చేనెల 1 నుంచి ప్రారంభమవుతుంది. రెండో దశ అయిన జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం 2027 ఫిబ్రవరిలో మొదలుపెట్టి మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకల్లా పూర్తిచేస్తారు.

# ఏపీలో అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్కుల ఏర్పాటు



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించామని, భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం రూ. 40 కోట్ల వరకు, 5-10 శాతం స్థిర మూలధన పెట్టుబడి సబ్సిడీ అందిస్తుందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 100% స్టాంపు డ్యూటీ రీయింబర్స్‌మెంట్, 100 శాతం భూ వినియోగ మార్పిడి రుసుము మినహాయింపు, పారిశ్రామిక టారిఫ్ ప్రకారం విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంట్ 7-15 ఏళ్ల పాటు 100 శాతం ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, 3 ఏళ్ల పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐలలో 50-100 శాతం రీయింబర్స్‌మెంట్, మెగా,అల్ట్రా-మెగా ప్రాజెక్టుల కోసం కేసు ప్రాతిపదికన ప్రత్యేక రాయితీలు ఇస్తుందన్నారు.

భారత దేశంలో ముంబై, బెంగళూరు, హైదరాబాద్ లలో ఈ తరహా పార్కులు నిర్వహిస్తున్న ఇమాజికా, వండర్ లా వంటి సంస్థలతో పర్యాటక శాఖ చర్చలు జరుపుతోందని.. వారు తిరుపతి మరియు విశాఖపట్నంలో ప్రాజెక్టులపై ఆసక్తి చూపారని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. డిస్నీ వరల్డ్ తరహా ఏర్పాటుకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి హిక్సా, అరేబియన్ ట్రావెల్ మార్కెట్, ఐటీబీ బెర్లిన్, వరల్డ్ ట్రావెల్ మార్ట్ వంటి అంతర్జాతీయ రోడ్‌షోలతో పాటు ఢిల్లీలో జరిగిన సాటే( సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్ టూరిజం ఎగ్జిబిషన్), హైదరాబాద్ లో జరిగిన ట్రావెల్ టూరిజం ఫెయిర్ (టీటీఎఫ్) వంటి జాతీయ, ప్రాంతీయ సదస్సులలో పాల్గొన్నామన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన విశాఖ భాగస్వామ్య సదస్సులో పర్యాటక శాఖ రూ. 18,448 కోట్ల విలువైన 102 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసిందని అందులో మూడు థీమ్ పార్కులకు సంబంధించినవని వివరించారు.

ప్రత్తిపాడుఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించిన కర్నూతల గ్రామంలోని స్థలంలో వీటి ఏర్పాటుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపితే సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారని మంత్రి దుర్గేష్ పునరుద్ఘాటించారు. పర్యాటక శాఖ పనితీరుపై, మంత్రి కందుల దుర్గేష్ సమర్థతపై ఎమ్మెల్యే రామాంజనేయులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

# 'వికసిత్ భారత్'తోనే భావితరాల భవిష్యత్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సామాజిక మాధ్యమాల కారణంగా 13 ఏళ్ల లోపు పిల్లలు నష్టపోకుండా నిషేధించే అంశాన్ని పరిశీలిస్తున్నామని త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికి సంబంధించి 90 రోజుల్లో విధి విధానాలు ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చల విడితనంపై మంత్రి నారా లోకేష్ లోకేశ్ అధ్యయనం చేసి కొన్ని సిఫార్సులు చేశారని సీఎం అన్నారు. శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. గత పాలకుల అస్తవ్యస్త విధానాల కారణంగా సంక్షోభంలో పడిన రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని ఆయన అన్నారు. వివిధ అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'గత పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. గడచిన 20 నెలల్లో కష్టాలు, సమస్యల్ని అధిగమించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి సంక్షేమం వైపుగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. 15 రోజుల పాటు జరిగిన శాసనసభలో ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తు గురించి చర్చలు జరిగాయి. భావితరాల భవిష్యత్ నిర్ణయించేలా ఈ సమావేశాల్లో చర్చలు, నిర్ణయాలు జరిగాయి. విభజన వల్ల, గత పాలకుల విధ్వంసం వల్ల నష్టపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోదీ సహకారంతో కీలకమైన నిర్ణయాలు తీసుకుని ప్రజలకు మేలు చేస్తున్నాం. గత ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేసిన అభ్యర్థుల్లో 94 శాతం మంది గెలవటం మా అందరిపై ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనం. ఎన్డీఏ పక్షాలన్నీ పూర్తి సఖ్యతతో ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**ప్రజలు ఓటేస్తేనే అధికారం..ప్రతిపక్షం :** 'తీవ్ర అగమ్య గోచరంగా మారిపోయిన రాష్ట్ర భవిష్యత్తును తిరిగి నిర్మించేలా, గట్టెక్కించే బాధ్యత తీసుకున్నాం. రూ.3.32 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టాం. ఎన్డీఏ పార్టీలన్నీ పూర్తి సమన్వయంతో వెళ్ల బట్టే అనుకున్నది సాధించగలిగాం. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ శాసన సభకు రాకుండా తప్పించుకు తిరుగుతోంది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే శాసనసభకు వస్తామని చెప్పటం ఏమిటి.? ప్రజలు ఓట్లు వేస్తేనే అధికారం, ప్రతిపక్ష హోదా వస్తాయి. ఈ నిబంధనలన్నీ రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నాయి. ఇవన్నీ తెలియకుండానే రాజకీయం చేస్తున్నారు. గత పాలనలో అన్ని వ్యవస్థలూ ధ్వంసం అయ్యాయి. అలాంటి పరిస్థితిని చక్కదిద్ది గాడిన పెట్టాం. 92 కేంద్ర ప్రాయోజిత పథకాలను నిర్వీర్యం చేశారు. కేంద్రం నిధులు దారి మళ్లించారు. ఒక్కజల జీవన్ మిషన్‌లోనే రూ.85 వేల కోట్లు రావాల్సి ఉంటే కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదనలు పెట్టారు. ఆ పథకానికి 5 ఏళ్లలో చేసిన ఖర్చు కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. మేం అధికారంలోకి వచ్చాక పథకం సమయాన్ని పొడిగించాలని కోరాం. ఇంటింటికీ కుళాయి ఇచ్చేలా ఈ జల్ జీవన్ మిషన్‌ను ప్రణాళిక చేశాం. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అభినందిస్తున్నాను.' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**అధిక వడ్డీలకు ప్రభుత్వ ఆస్తులు తాకట్టు ప్రజాధనం దుర్వినియోగం :** 'ప్రజలకు మెరుగైన సుపరిపాలన ఇచ్చేందుకు నిరంతరం పోరాటం చేశాం. గత పాలకులు ప్రభుత్వ ఆస్తులు కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. ఎమ్మార్వో ఆఫీసు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సర్క్యూట్ హౌస్‌లాంటి ఆస్తులను తాకట్టు పెట్టారు. 12, 13 శాతంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రభుత్వ ఆర్థిక వనరుల్ని దుర్వినియోగం చేశారు. రూ.43,298 కోట్ల విలువైన అప్పులకు ప్రభుత్వం రీ షెడ్యూలు చేయించాం. తద్వారా రూ.328 కోట్ల మేర ఆదా అవుతుంది. మరో రూ.1 లక్ష కోట్ల మేర అప్పులు కూడా రీ షెడ్యూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల రూ.1,658 కోట్ల వెసులుబాటు వస్తుంది. ఈ నిధులతో మరో సంక్షేమ పథకాన్ని అమలు చేసే అవకాశం ఉంటుంది. ఒక వ్యక్తి తన స్వార్థంతో రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేసేశారు. గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేసి నీళ్లు ఇస్తాం. కేంద్ర సహకారంతో అమరావతి రాజధానిని ట్రాక్‌లో పెట్టాం. మూడేళ్లలో రాజధానికి ఓ రూపు వస్తుంది. వచ్చే సమావేశాలకు ఎమ్మెల్యేలు, మంత్రులు రాజధానిలోని వారి క్వార్టర్లలో ఉండేలా చర్యలు చేపడుతున్నాం. కేంద్ర నిధులతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. తొలిసారి విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి వచ్చింది. స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారాన్ని అందిస్తోంది' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**గత పాలనలో ట్రూ అప్.. కూటమి వచ్చాక ట్రూడౌన్ :** 'రాష్ట్రానికి నీటి భద్రత అత్యంత ముఖ్యమైన అంశం. 20 నెలల్లో దీనికి అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. హంద్రీనీవాకు రూ.3850 కోట్లు ఖర్చు చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. అనంతపురం లాంటి జిల్లాకు 55 టీఎంసీల నీటిని తీసుకువెళ్లాం. ప్రస్తుతం వేసవి వచ్చినా 628 టీఎంసీల నీరు వివిధ రిజర్వాయర్లలో నిల్వ ఉంది. సమర్ధ నీటి నిర్వహణతోనే ఇది సాధ్యమైంది. భూగర్భజలాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో 2.96 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగేలా వివిధ సంరక్షణా చర్యలు చేపట్టాం. భూగర్భ జలాలు పెరగటం వల్ల వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గింది. ఆ మేరకు వ్యయాన్ని ఆదా చేసుకున్నాం. ఎన్ని ఇబ్బందులు ఉన్నా కరెంటు ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. గత పాలకులు రూ.32 వేల కోట్ల కరెంటు ఛార్జీల భారం ప్రజలపై మోపారు. ట్రూ అప్ భారం వేస్తే చరిత్రలో తొలిసారి మేం ట్రూడౌన్ చేశాం. రూ.4420 కోట్ల మేర ట్రూ అప్ భారాన్ని ప్రజలపై మోపకుండా చర్యలు తీసుకున్నాం. పీఎం సూర్యఘర్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర ప్యానెళ్లు ఏర్పాటు చేసి ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. యూనిట్ కొనుగోలు ధరను రూ.5.19 నుంచి 4.80కు తగ్గించేలా చర్యలు చేపట్టాం. అగ్రిటెక్‌తో వ్యవసాయ రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. రూ.1 లక్ష కోట్లతో ఉమ్మడి ప్రకాశం సహా రాయలసీమ జిల్లాలను హార్టీ కల్చర్ హబ్‌గా పూర్వోదయ పథకం కింద అభివృద్ధి చేస్తాం' అని సీఎం తెలిపారు.

**ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు :** 'ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు ఇవ్వాలనే పది సూత్రాలతో 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పన చేశాం. ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. త్వరలోనే ప్రతీ కుటుంబానికి ఫ్యామిలి బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టం కార్డును కూడా జారీ చేస్తాం. కేంద్రం, రాష్ట్రం అందించే పథకాలన్నిటినీ ఈ కార్డు ద్వారా ఇంటిగ్రేట్ చేస్తాం. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంది. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. సర్క్యులర్ ఎకానమీతో వ్యర్థాల ద్వారా సంపద సృష్టిస్తున్నాం. ఇటీవలే వివాదాల పరిష్కారించేలా మధ్యవర్తిత్వంపై ఓ సదస్సు జరిగింది. మధ్యవర్తిత్వంపై దృష్టి పెట్టాలని సూచనలు వచ్చాయి. వివాదం పరిష్కారం అయితే రూ.10 వేల ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించాం. రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్ననాలా చట్టాన్ని రద్దు చేసి అవినీతిని కట్టడి చేశాం. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను రద్దు చేస్తున్నాం అవసరమైన మార్పులు చేస్తున్నాం. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపింది. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ.సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు మాత్రమే వేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లో 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం చర్యలు తీసుకున్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలలు నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం కూడా జరుగుతోంది. 9 కోట్ల పని దినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగింది. బడ్జెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి అన్నారు.

**వైట్ కాలర్ క్రైమ్స్, సోషల్ సైకోలు అరాచకం :** 'స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నాం. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నాం. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నాం. సుప్రీంకోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటాం. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తాం. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయిస్తాం. హెల్తీ, వెల్తీ హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నాం. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నాం. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారు. మహిళలపై నేరాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నాను. మావోయిస్టులను కట్టడి చేశాం, ఫాక్షనిజం రూపుమాపాం తద్వారా ప్రగతి సాధించాం' అని సీఎం తెలిపారు.

**పెళ్లికి వెళ్లి రప్పా రప్పా అంటూ దాడులు చేయడం ఎక్కడి సంస్కృతి? :** 'రాష్ట్రంలో ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చింది. ఓ రాజకీయ నాయకుడు పర్యటన చేస్తే రప్పా రప్పా అంటున్నారు. పెళ్లికి వెళ్లి రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రత కోసం వెళ్లిన ఎస్ఐ గాయపడినా పట్టించుకోవటం లేదు. గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకుని తిరిగే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా?. పోస్టు మార్టానికి కారకులైన వారు పోస్టు మార్టానికే వెళ్తారు. రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి, టైర్ల కింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి. 5 కిలోమీటర్ల దూరాన్ని 6-7 గంటల పాటు ప్రయాణిస్తారా ఎవరైనా.? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నారు మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటం ఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించలేదు' అని సీఎం వ్యాఖ్యానించారు

**రెండు కొండలన్నప్పటి నుంచే కుట్రలు :** 'తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని గత పాలకులు అపవిత్రం చేశారు. ఇది తెలియకుండా జరిగిన వ్యవహారం కాదు. కుట్రతోనే కావాలని చేసిన నేరం. ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోంది. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదిక కూడా అది కల్తీ నెయ్యి అని స్పష్టంగా తేల్చి చెప్పింది. దేశ వ్యాప్తంగా హిందూ మఠాలు, పీఠాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదు. ప్రభువా క్షమించు అంటూ సాక్షిపత్రికలో పెద్ద ఎత్తున వార్తలు రాయించుకున్న వ్యక్తి తిరుమల నైవేద్యం కల్తీ చేసి ఏడుకొండల స్వామికి క్షమాపణలు చెప్పరా? మత సామరస్యాన్ని గౌరవించకుండా.. క్షమాపణ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారు. శాసనమండలిలోనూ ఇదే అంశంపై గొడవ చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తారా?' అని సీఎం నిలదీశారు.

**వ్యక్తిగత ప్రవర్తనతో చెడ్డ పేరు తేవొద్దు :** పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధాలతో మన మార్కెట్లు ప్రభావితం అవుతున్నాయి. ఎగుమతులు పడిపోవటంతో అరటి ధర తగ్గిపోయింది. చమురు ధరల వల్ల కూడా ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు వ్యవహరించాలి. ప్రజాప్రతినిధులు-అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరుతున్నాను. కూటమిగా వెళ్లి ప్రజల మద్దతుతోనే అంతా గెలిచామని గుర్తుంచుకోవాలి. వ్యక్తిగత ప్రవర్తన వల్ల ప్రభుత్వానికి, పార్టీలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని కోరుతున్నాను. 15 ఏళ్లపాటు ఎన్డీఏ కూటమి కొనసాగితేనే రాష్ట్రానికి మంచి జరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పదేపదే చెబుతున్నారు. కూటమిగా మనకు ఓ అజెండా ఉంది. 2029లోనూ మనం గెలిచి 2047 లక్ష్యాలను సాధించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# స్వదేశీ ఆత్మగౌరవం.. బీజేపీ సంకల్పం





(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధుల ద్వారా సమాజంలో స్వదేశీ వినియోగంపై చైతన్యం పెంచాలన్న ఉద్దేశంతో అసెంబ్లీ, మండలి సభ్యులకు కిట్‌లను అందజేసి వాటి ప్రాధాన్యాన్ని వివరించారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా కలిసి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం చాంబర్‌ను సందర్శించారు. అక్కడ బీజేపీ శాసనసభ పక్షనేత సోము వీర్రాజుతో సమావేశమై 'వికసిత భారత్' లక్ష్యాలపై చర్చించారు. అనంతరం జకియా ఖానం, సోము వీర్రాజులకు స్వదేశీ కిట్‌లను అందజేశారు.

తరువాత శాసనమండలికి చేరుకున్న పీవీఎన్ మాధవ్ సభ్యులతో ముచ్చటిస్తూ స్వదేశీ వస్తువుల ప్రాముఖ్యతను వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ చాంబర్‌ను సందర్శించిన బీజేపీ నేతలు అక్కడ ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా స్వదేశీ కిట్‌లను అందజేశారు.

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాంబర్‌కు వెళ్లిన పీవీఎన్ మాధవ్ నేతృత్వంలోని బీజేపీ నాయకులు కొద్దిసేపు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాధవ్ అందజేసిన స్వదేశీ కిట్‌ను ముఖ్యమంత్రి చిరునవ్వుతో స్వీకరించారు. స్వదేశీ వస్తువుల వినియోగంపై చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి సందర్భోచితంగా ప్రస్తావించారు.

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చాంబర్‌కు వెళ్లిన బీజేపీ నేతలను లోకేష్ ఆత్మీయంగా స్వాగతించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్‌ను ఉద్దేశించి సరదాగా వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాంపై కూడా చలోక్తులు విసిరారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌తో మాధవ్ కొద్దిసేపు సౌహార్దపూర్వకంగా చర్చించారు.

శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు స్వదేశీ కిట్ స్వీకరిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి స్వదేశీ విధానం కీలకమని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు కూడా మాధవ్ స్వదేశీ కిట్‌ను బహూకరించారు.

శాసనసభ ఉపస్పీకర్ రఘురామకృష్ణరాజు స్వదేశీ ఉద్యమాన్ని అందరూ ప్రోత్సహించాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి 'వికసిత భారత్' తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలోని బీజేపీ రాష్ట్ర నాయకులు అసెంబ్లీ గ్యాలరీ నుంచి సమావేశాలను వీక్షించారు.

సభ ముగింపు సమయంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు గ్యాలరీలో మాధవ్ ఉన్నారని ప్రస్తావించడంతో ఎమ్మెల్యేలు ఒక్కసారిగా గ్యాలరీ వైపు చూశారు. దీంతో సభలో ఆసక్తికర వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమాల ద్వారా స్వదేశీ వస్తువుల వినియోగంపై అవగాహన పెంచేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీసుకున్న చొరవను పలువురు ప్రశంసించారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర నాయకులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్‌ల పంపిణీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 7వ తరగతి నుంచి 12వ తరగతి బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ లను పంపిణీ చేయడం జరుగుతోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలోని విద్యార్థులకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ లను అందించడంపై శాసనమండలిలో సభ్యులు కావలి గ్రీష్మ అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానం ఇస్తూ.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో 7వ తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ లను సరఫరా చేయడం జరుగుతోంది. గతంలో ఏడు రెగ్యులర్ సైజ్, మూడు లార్జ్ సైజ్ న్యాప్ కిన్ లు ఇచ్చేవారు. ఫీడ్ బ్యాక్ తీసుకున్న తర్వాత 5 రెగ్యులర్ సైజ్, 5 లార్జ్ సైజ్ శానిటరీ ప్యాడ్ ను ప్రభుత్వం అందజేస్తోంది. గత ప్రభుత్వంలో 18.96 కోట్ల బకాయిలు పెట్టారు. ప్రజా ప్రభుత్వం ఆ బకాయిలను తీర్చడం జరిగింది. ఆర్టీజీఎస్ నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్ కాల్స్ చేసి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతోంది. 96శాతం బాలికలు తమకు శానిటరీ న్యాప్ కిన్ లు అందుతున్నాయని, 4 శాతం మంది అందడం లేదని చెప్పడం జరిగింది. నాణ్యత విషయంలో 1 శాతం బాగాలేదని, 14శాతం పర్వాలేదు, బాగుందని 85శాతం మంది చెప్పారు. శానిటరీ న్యాప్ కిన్స్ ఎబ్జార్ ప్షన్ పై 84శాతం మంది బాగుందని, 14 శాతం మంది పర్వాలేదని, బాగాలేదని 2శాతం మంది ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. సైజ్ విషయంలో 89శాతం మంది బాగుందని, 11శాతం బాగాలేదని చెప్పారు. ఎకో ఫ్రెండ్లీ శానిటరీ ప్యాడ్స్ పంపిణీపైనా చర్చించడం జరిగింది. దీనిపైనా పరిశీలన చేస్తాం. ఎన్జీవోలతో మాట్లాడి బాలికల్లో అవగాహన పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటాం. వెండింగ్ మిషన్స్ విత్ స్మార్ట్ కార్డ్ ను ఇప్పటికే కేజీబీవీల్లో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాం. అన్ని పాఠశాలలకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటాం. హెచ్ పీవీ వ్యాక్సిన్ ను ప్రధాని నరేంద్ర మోదీ గారు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇదో క్యాంపెయిల్ లా చేస్తాం. దీనిపై అనేక అపోహలు ఉన్నాయి. ఇది అవసరం. అందరం కలిసికట్టుగా దీనిపై అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి చెప్పారు.

అంతముందు ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ మాట్లాడుతూ.. విద్యార్థినులకు నెలసరి వచ్చే సమయంలో సరైన హైజీన్ ప్రొడక్ట్స్ అందక పాఠశాలలకు గైర్హాజరవుతున్నారు. ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో, కాలేజీల్లో చదవుతున్న బాలికలకు ఎకో ఫ్రెండ్లీ శానిటరీ ప్యాడ్స్ కచ్చితంగా అందించాలని ప్రభుత్వాన్నికోరారు.

# 20 నెలల్లో 9వేల నియామకాలు

(మొదటి పేజీ తరువాయి)

78 ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల పోస్టులతో కలిపి పారా మెడికల్ కేటగిరిలో కలిపి 261 పోస్టుల భర్తీకి చర్యలు తీసకుంటున్నామని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ చర్యల్లో భాగంగా పొరుగు సేవల కింద గడచిన 20 నెలల్లో 223 పోస్టుల భర్తీ చేసినట్లు వివరించారు. పేదలకు వైద్య సేవలు మరింత చేరువ చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం లోని 'ఆలోచన' హాలులో నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ (అసంక్రమిత) వ్యాధుల నిరోధ చర్యల్లో భాగంగా ప్రాంతీయ(సి హెచ్‌సిలు), ఏరియా ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటైన ఎన్‌సిడి క్లినిక్ ల నిర్వహణ అవసరాల కోసం ఎంపికచేసిన 74 మంది వైద్యులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం నియామకపత్రాలు అందచేశారు. ఈ సంద్భంగా మంత్రి మాట్లాడుతూ జీవనశైలిలో వచ్చిన మార్పులవల్ల అసంక్రమిత వ్యాధులు రోజురోజుకీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్ చర్యల్లో భాగంగా ప్రత్యేకంగా చేపట్టిన ఎన్.సి.డి. 04 సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కేసుల గుర్తింపు పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఈ సర్వేలో భాగంగా అనుమానిత లక్షణాలు కనిపించిన వారిని ప్రాంతీయ, ఏరియా ఆసుపత్రులకు పి హెచ్‌సి వైద్యులు పంపుతున్నారని, వీరికి వైద్య సేవలు అందించడంలో కొత్తగా ఎంపికైన వైద్యుల కీలక పాత్ర పోషించబోతున్నారని తెలిపారు. క్యాన్సర్ కేసుల్లో 60% వరకు ముందస్తు పరీక్షల ద్వారా నిరోధించగలిగేవని అన్నారు.

**మీపై గురుతర బాధ్యత ఉంది:** కొత్తగా నియమితులైన వైద్యులపై గురుతర బాధ్యత ఉందని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు పేర్కొన్నారు. పీహెచ్సీలు, బోధనాసుపత్రుల మధ్య వారధిగా ఉండే ఆసుపత్రుల్లో పనిచేయనున్న వైద్యులు రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కొత్త వైద్యుల రాకతో ఇతర వైద్యులపై ఉన్న ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ ఆసుపత్రుల్లోనే డెలవరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, కేంద్ర పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఓపీ, ఐపీ సేవలు పెరిగాయని, అభా ఐడీతో రోగుల వివరాల డిజిటలైజేసన్ చేస్తున్నామని పేర్కొన్నారు ఈ కార్యక్రమ వేదికను అలంకరించిన వారిలో వైద్య నియామక బోర్డు ఇంచార్జి కార్యదర్శి శేషారెడ్డి, జాయింటు డైరెక్టర్ (ఎన్సీడీ) శ్యామల, జాతీయ ఆరోగ్య మిషన్ సీఏఓ ప్రకాష్ రావు ఉన్నారు.

## అంగన్ వాడీలు, ఆశావర్కర్లు, వీఏవోలతో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అంగన్ వాడీలు, ఆశావర్కర్లు, వీఏవోలతో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ధర్నాలు చేయాల్సిన అవసరం లేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అంగన్ వాడీల విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. దీనిపై మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ.. వైసీపీ తీరును తప్పుబట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ రోజు ప్రతిపక్ష సభ్యులు వెనుక తలుపు నుంచి వాకౌట్ చేస్తున్నారు. మొన్న ముందు తలుపు నుంచి వాకౌట్ చేశారు. వారు వాకౌట్ చేయాల్సిన పనిలేదు. వినేందుకు సభ్యులకు ఓపిక ఉండాలి. ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ అని ప్రతిపక్ష నేత బొత్స అన్నారు. అమరావతి పనులు ఎందుకు నిలిపివేశారు? అన్న క్యాంటీన్లను ఎందుకు మూసేశారు? అన్ని సంఘాలతో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇది ప్రజా ప్రభుత్వం. మేం పరదాలు కట్టుకుని తిరగడం లేదు. విద్యాశాఖలో కూడా వివిధ సంఘాలను కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నాం.

అంగన్ వాడీలు, ఆశావర్కర్లు, వీఏవోలతో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ధర్నాలు అసలు చేయాల్సిన అవసరం లేదు. మొన్న అంగన్ వాడీలకు సాయంత్రం 6 గంటల వరకు పర్మిషన్ ఇచ్చారు. వారు మధ్యాహ్న భోజనం కూడా అన్న క్యాంటీన్లలో చేశారు. మంచినీరు కూడా అందించాం. అంబులెన్స్ లు కూడా అందుబాటులో ఉంచాం. సాయంత్రం తర్వాత అనుమతి లేకుండా ఉండటంతో అందరం కంగారు పడ్డాం. వారి రక్షణ దృష్ట్యా బతిమిలాడి మహిళా కానిస్టేబుల్స్ తో తీసుకెళ్లడం జరిగింది. మేం ఎవరినీ అరెస్ట్ చేయలేదు. ఎవరిపైనా కేసులు పెట్టాల్సిన అవసరం లేదు. వారితో చర్చించే మేం పనిచేస్తాం. వారిని పిలుస్తాం, మాట్లాడతాం. వేతనాల పెంపు పరిశీలనలో ఉందని మంత్రి చెప్పారు. గౌరవ సీఎం గారు కూడా నిర్ణయం తీసుకుంటారని అంగన్ వాడీలకు తెలియజేస్తున్నా. ఆశావర్కర్లు, వీఏవోలకు కూడా ప్రభుత్వం తరపున హామీ ఇస్తున్నానని మంత్రి తెలిపారు.

## కేంద్రం కీలక నిర్ణయం.. న్యూస్ ఛానళ్లకు టీఆర్పీ రేటింగ్‌ల నిలిపివేత




**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలోని వార్తా ఛానళ్లలో పెరుగుతున్న సంచలనాత్మక ధోరణిని అరికట్టేందుకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఒక అనూహ్య నిర్ణయం తీసుకుంది. న్యూస్ ఛానళ్ల టెలివిజన్ రేటింగ్ పాయింట్స్ నివేదికలను నాలుగు వారాల పాటు లేదా తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు నిలిపివేయాలని బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ ను ఆదేశించింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో భారతీయ వార్తా ఛానెళ్లు విపరీతమైన కవరేజీని అందిస్తున్నాయి. అయితే, కొన్ని ఛానళ్లు యుద్ధం గురించి ఊహాజనిత మరియు అతిశయోక్తితో కూడిన వార్తలను ప్రసారం చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. యుద్ధ ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు లేదా స్నేహితులు ఉన్న ప్రజల్లో ఇటువంటి వార్తలు అనవసరమైన ఆందోళనను, భయాన్ని కలిగిస్తాయని మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.

**నాలుగు వారాల పాటు నిషేధం..:** రేటింగ్‌ల కోసం పోటీ పడుతూ, బాధ్యతను విస్మరించి సంచలనం కోసం వార్తలను ప్రసారం చేయడం సరికాదని కేంద్రం పేర్కొంది. "ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాం. కొన్ని ఛానెళ్లు యుద్ధానికి సంబంధించి అనవసరమైన హైప్ ఇస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రసారాలు చేస్తున్నాయి. రేటింగ్‌ల వేటలో పడి వార్తల్లో ఉండాల్సిన ప్రామాణికతను పక్కన పెడుతున్నారు," అని మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. వార్తా ఛానెళ్లకు వచ్చే ప్రకటనల ఆదాయాన్ని నిర్ణయించడంలో టీఆర్పీ రేటింగ్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నిషేధం నాలుగు వారాల పాటు అమల్లో ఉంటుంది. పరిస్థితిని సమీక్షించిన తర్వాత ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

## మూడవ రోజు కొనసాగిన బీజేపీ మహిళా మోర్చా ఉచిత వైద్య శిబిరం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా గుంటూరులో మహిళల కోసం ప్రత్యేక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం మూడవ రోజు మహిళలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నిరంతరాయంగా జరిగిన ఈ వైద్య శిబిరాన్ని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ శనక్కాయల రాధా మాధవి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందం సహకారంతో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు.

శిబిరంలో జిల్లా ఉపాధ్యక్షురాళ్లు మంత్రి సుగుణ, వంగిపురపు విమలాదేవి, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు అడ్వకేట్ స్వాతి పల్లెబోయిన, ప్రధాన కార్యదర్శి కటారి పద్మజ, ఉపాధ్యక్షురాళ్లు వాణి వెంకట్, సాధు వాణి, కార్యదర్శి పరిపాటి రాధిక పాల్గొన్నారు. అలాగే ఈస్ట్ 11వ మండల అధ్యక్షుడు శేగు వెంకట నరేష్, ఈస్ట్ 14వ మండల ఉపాధ్యక్షుడు అనిల్, జిల్లా సీనియర్ నాయకుడు సురేష్ జైన్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈస్ట్ 6వ మండలానికి చెందిన సుమారు వంద మంది మహిళలు ఉచిత కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మహిళా ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ డాక్టర్ రాధా మాధవి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు, పార్టీ శ్రేణులు అభినందించారు.

# ప్రాజెక్టుల నిర్మాణ నాణ్యతలో రాజీ లేదు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఎంతో ప్రాధాన్యమిస్తోంది. రకరకాల కారణాలతో రాష్ట్రంలో కొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు సుదీర్ఘ కాలంపాటు ఎన్నికల హామీలుగా మిగిలిపోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాకపోవడం సరికాదు. ఇలాంటి వాటికి చెక్ పెట్టాలి. ప్రాజెక్టులు కట్టాలనే డిమాండ్లు ఎన్నికల హామీలుగా మిగిలిపోకూడదు. ప్రజల అవసరాలను తీర్చేలా ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేయాలి. అందుకే ప్రణాళికాబద్ధంగా... ప్రాధాన్యతలను సిద్ధం చేసుకుని ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నాం. పోలవరం సహా రాయలసీమ, పల్నాడు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నాం. ఇరిగేషన్ రంగానికి గతంలోనూ... ఇప్పుడు పెద్ద పీట వేసి అవి పూర్తి అయ్యేలా చేసింది.. చేస్తోంది కూటమి ప్రభుత్వమే. ఇదే సమయంలో ప్రాజెక్టుల నిర్మాణాల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే ఉండకూడదు. ఈ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తాను. ఉన్నతాధికారులు మొదలుకుని.. క్షేత్ర స్థాయిలో ఉన్న సిబ్బంది ఏ ఒక్కరూ అలక్ష్యం వహించినా చర్యలు తీసుకుంటాను. ఉమ్మడి రాష్ట్రంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడు... గత ప్రభుత్వ పాలనలోనూ ప్రాజెక్టుల నిర్మాణాల్లో నాణ్యత విషయంలో కాంప్రమైజ్ అయ్యేవారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఝంఝావతి రబ్బర్ డ్యాం కొట్టుకుపోయింది. గత ప్రభుత్వంలో కీలకమైన పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ దెబ్బతినేలా చేశారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్ కు రిపేర్లు చేసినా సరిపోతుందని నిపుణులు నివేదికలు ఇచ్చినా.. నాణ్యత విషయంలో, ప్రజా భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశ్యంతోనే కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం."అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.



**ప్రతి అంశమూ కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి:** "పోలవరం నిర్మాణం విషయంలో కేంద్రంతో నిరంతరం టచ్ లో ఉండాలి. పోలవరం నిర్మాణానికి సంబంధించిన ప్రతి అప్డేట్ కేంద్రంలోని సంబంధిత వ్యవస్థలకు ఎప్పటికప్పుడు చేర్చాల్సిందే. ప్రమాణాలు, నాణ్యత పాటించే విషయం సహా నివేదికల పరంగా, సాంకేతికాంశాల పరంగా, డాక్యుమెంటేషన్ పరంగా ఎలాంటి లోపాలు ఉండకూడదు... తేడాలు రాకూడదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్రం సహా ఎవ్వరూ వేలెత్తి చూపే పరిస్థితి రాకూడదు. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు అంతర్జాతీయ స్థాయి నిపుణులు తరుచూ సందర్శనకు వచ్చేలా చూడండి. వీలు కాకుంటే వీడియో కాన్ఫరెన్సుల ద్వారానైనా వారి సలహాలను స్వీకరించండి. చారిత్రాత్మక నిర్మాణాలు చేపడుతున్నప్పుడు.. జీవనాడి లాంటి ప్రాజెక్టులను చేపడుతున్నప్పుడు అదే స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రమాణాలు పాటించే విషయంలో చాలా కచ్చితంగా ఉంటాను. రాష్ట్ర ప్రభుత్వం టైం బౌండ్ పెట్టుకుని పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతోందనే విషయాన్ని కేంద్రంలోని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఇకపై పోలవరం ప్రాజెక్టుపై ప్రతి నెలా సమీక్షిస్తా. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు రిలాక్స్ కావడానికి వీల్లేదు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులు మేఘాద్రిగడ్డ వం-కు పూర్తి కావాలి. రైట్ మెయిన్ కెనాల్ లో ఇంకా రూ. 200 కోట్ల మేర పనులు పూర్తి చేయాల్సి ఉంది. వీటిని కూడా ఈ సీజన్లో పూర్తి చేయాలి. డయాఫ్రం వాల్ నిర్మాణం ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి. 41.15 మీటర్ల వరకు నీళ్లను నిలిపేందుకు అవసరమైన నిర్మాణ, పునరావాస పనులు కంప్లీట్ కావాలి. పునరావాసం విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే... వెంటనే పరిష్కరించుకోవాలి. దీనికి అవసరమైన నిధులు, పరిపాలనా అనుమతుల విషయంలో జాప్యం చేయవద్దు. పునరావాసం విషయంలో నిర్వాసితులతో నిరంతరం సంప్రదింపులు జరిపి సాఫీగా ఆర్ అండ్ ఆర్ పనులు చేపట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలి"అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**వెలిగొండ... ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు పరుగులు పెట్టాలి :** "వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడానికి రూ. 2041 కోట్లు అవసరమవుతాయి. ఓవైపు ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతూనే.. మరోవైపు పునరావాసం పైనా ఫోకస్ పెట్టాలి. దీనికి అవసరమైన మేరకు విడతల వారీగా నిధులను విడుదల అయ్యేలా ఆర్థిక శాఖ అధికారులతో ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకోవాలి. హంద్రీ-నీవా ఫేజ్-1 కెనాల్ వైడనింగ్ 92 శాతం పూర్తి అయింది. కుప్పం-పుంగనూరు కాల్వలను 85 శాతం కంప్లీట్ చేసుకున్నాం. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. హంద్రీ-నీవా జలాలు మడకశిర వరకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా చిత్తూరు వరకు నీటిని తీసుకెళ్లాల్సి ఉంటుంది. పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. అనుమతులు సాధించాలి. వరికిపూడిశెల ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు వచ్చేస్తే పనులు మొదలు పెట్టండి. అలాగే ప్రాధాన్యత క్రమంలో చింతలపూడి లిఫ్ట్ పనులను పూర్తి చేయాలి. ఉత్తరాంధ్రలో చిన్న చిన్న ప్రాజెక్టులను కూడా పెండింగులో పెట్టేశారు. తక్కువ ఖర్చు పెడితే పూర్తయ్యే ప్రాజెక్టులను ముందుగా టేకప్ చేసే అంశాన్ని పరిశీలించండి. వంశధార-నాగావళి, తోటపల్లి బ్యారేజ్, తారకరామ, మహేంద్ర తనయ ఆఫ్ షోర్, హీర మండలం, మద్దువలస, ఝంఝావతి, నాగావళి-చంపావతి లింక్ వంటి ప్రాజెక్టుల పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలి.. ఫలితం చూపెట్టాలి. ఏపీఎస్ఐడీసీ పరిధిలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మత్తులు, నిర్వహణ కోసం హ్యామ్ పద్ధతిలో పనులు చేపట్టాలి. రాష్ట్రంలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టే ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా చూసుకోవాలి. ఈ మేరకు ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకోవాలి. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిమిత్తం విడతల వారీగా నిధులు విడుదల చేసే విధంగా ఆర్థిక శాఖ రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలి."అని ముఖ్యమంత్రి నిర్దేశించారు.

# ఆహార కల్తీ నిరోధానికి...పటిష్టమైన తనిఖీ వ్యవస్థ

- **ఆహార పదార్థాల కల్తీపై ప్రజలు గళం విప్పాలి**
- **కల్తీరాయుళ్లలో భయం పెరిగేలా కఠిన నిబంధనల కోసం కేంద్రంతో చర్చిస్తాం**
- **నిర్వీర్యమైన తనిఖీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం**
- **సింథటిక్ రంగుల వాడకం- ఆరోగ్యానికి హానికరం**
- **ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం**
- **రాష్ట్ర శాసనసభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆహార పదార్థాల కల్తీపై ప్రజలు ఎప్పటికప్పుడు గళం విప్పాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజలు కూడా ఉద్యమిస్తే ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టవచ్చని, కల్తీపై ప్రజలు ఫిర్యాదులు చేస్తే తగు చర్యల్ని చేపడుతున్నామని తెలిపారు. అలాగే కల్తీకి పాల్పడే వారిలో మరింత భయం పెరిగేలా కఠిన చర్యలు తీసుకునేందుకు వీలుగా నిబంధనల మార్పు కోసం ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ అఫ్ ఇండియా(ఎఫ్ఎస్-ఎస్ఎఐ) అధికారులతో కూడా చర్చించనున్నామని వెల్లడించారు. రాష్ట్ర శాసనసభలో శుక్రవారం సభ్యులు గల్లా మాధవి, అదిరెడ్డి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సత్యకుమార్ సమాధానమిస్తూ... గత వైకాపా ప్రభుత్వం ఆహార పదార్థాల తనిఖీల వ్యవస్థ (ఇన్స్టిట్యూట్ అఫ్ ప్రివెంటివ్ మెడిసిన్-ఫుడ్ సేఫ్టీ )ను పూర్తిగా నిర్వీర్యం చేసినందున ప్రజారోగ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. తనిఖీల నిర్వహణ, ప్రయోగశాలల ఏర్పాటు, అవసరాలకు తగ్గట్లు సిబ్బంది నియామకాలు చేయడంలో అడుగడుగునా గత వైకాపా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. ఈ పరిస్థితుల్ని చక్కదిద్దే చర్యల్లో భాగంగా ఐపీఎంను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఆకస్మిక



తనిఖీల ద్వారా ఆహార పదార్థాల నమూనాల సేకరణతోపాటు పరీక్షలు చేయడం వంటి చర్యలను వేగవంతం చేసినట్లు తెలిపారు. ప్రజలు తమ దృష్టికి వచ్చిన ఆహార పదార్థాల కల్తీ ఘటనల గురించి టోల్ ఫ్రీ నెంబర్లు (1800 425 3857, 08645-297245) ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

**తనిఖీలు కొనసాగిస్తున్నాం :** 2023-24 నుంచి 2026 జనవరి వరకు మొత్తం 16,730 నమూనాలు పరీక్షించగా వాటిలో 1,407 నమూనాలు సురక్షితమైనవి కావని, నాణ్యత లేదని, నకిలీ బ్రాండ్ తో విక్రయిస్తున్నారని తేలిందన్నారు. కల్తీకి పాల్పడిన వారిని న్యాయస్థానాల్లో ప్రాసిక్యూషన్ చేయడం ద్వారా జరిమానా విధించడం వంటి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం చట్టప్రకారం ' అన్ సేఫ్ ' కేటగిరిలో మాత్రమే గరిష్టంగా అరునెలల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. దీనివల్ల కల్తీకి పాల్పడే వారిలో భయం ఉండడంలేదని పేర్కొన్నారు. ప్రస్తుత నిబంధనలను మరింత కఠినతరం చేసేందుకు ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో సంప్రదిస్తామని తెలిపారు. తిరుమల, తిరుపతి. కర్నూలు, విశాఖ, గుంటూరులలో రాష్ట్ర స్థాయి ప్రయోగశాలలు రాబోతున్నాయన్నారు. వీటికి ఎన్ఏబిఎల్ అక్రిడిటేషన్ లభిస్తే నమూనాల పరీక్షలు, ఫలితాలకు గుర్తింపు పెరిగి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఐపీఎం పరిధిలో 720 పోస్టులు మంజూరు కాగా కేవలం 144 మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. ఇటీవల 150 పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి అనుమతించారని తెలిపారు.

**రంగుల ఆహార పదార్థాలతో ఎర-ప్రజలు దూరంగా ఉండాలి :** ఇటీవల గుంటూరు, విజయవాడ, రాజమహేంద్రవరం వంటిచోట్ల తనిఖీలు జరిపినప్పుడు ఆహార పదార్థాల్లో సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు తేలిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ సభకు తెలిపారు. చిల్లీ చికెన్ వంటి వంటకాలు ఎర్రగా కనిపించేందుకు, బెల్లంలో కూడా గోధుమ రంగు రావడానికి సింథటిక్స్ కలర్స్ వాడుతున్నట్లు కూడా తమ దృష్టికి వచ్చిందన్నారు. రంగు బాగుందన్న భ్రమలో సదరు ఆహార పదార్థాలను స్వీకరిస్తున్నారన్నారు. వీటిని ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి చాలా హానికరమని, దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రజల్లో మార్పుతెచ్చేందుకు విస్తృతస్థాయిలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఇతర ప్రదేశాల్లో హోర్డింగుల్ని ఏర్పాటు చేయడం, పోస్టర్లు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించడం వంటి ప్రచార మార్గాల్ని అనుసరిస్తున్నామని మంత్రి తెలిపారు.

**"డార్క్ సోర్ట్స్"పై నిఘా :** ఈ-కామర్స్ డార్క్ స్టోర్స్ (సత్వర వాణిజ్యం) పై నిఘా పెట్టామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ శాసన సభలో వెల్లడించారు. రాష్ట్రంలో 277 ఈ-కామర్స్ స్టోర్లున్నాయని చెప్పారు. డార్క్ స్టోర్లకు ఎఫ్ఎస్ఎస్ఎఐ నుంచి తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగానే వీటిని కూడా ఐపీఎం ద్వారా తనిఖీలు చేస్తున్నామన్నారు. డార్క్ స్టోర్స్ లో 2023-24లో 17, 2024-25లో 27, 2025-26లో ఇప్పటివరకు 24 తనిఖీలు చేపట్టామని మంత్రి శ్రీ సత్యకుమార్ వివరించారు. రాజమహేంద్రవరంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటన దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

## అక్రమ పశువుల రవాణా అరికట్టేందుకు చర్యలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో అక్రమ పశువుల రవాణాను అరికట్టేందుకు పశుసంవర్ధక శాఖ కీలక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో పశువుల రవాణా సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే డిజిటల్ ట్రాన్స్‌పోర్ట్ సర్టిఫికెట్ జనరేషన్ సిస్టమ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ రూపొందించిన ఈ వ్యవస్థ ద్వారా పశువుల రవాణా మరింత పారదర్శకంగా, నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇకపై పశువులను రవాణా చేయదలిచిన ప్రతి వ్యక్తి సంబంధిత పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి డిజిటల్ ట్రాన్స్‌పోర్ట్ సర్టిఫికెట్ పొందిన తర్వాత మాత్రమే రవాణా చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సర్టిఫికెట్‌ను పశువుల రవాణా నిబంధనలకు అనుగుణంగా జారీ చేయడం జరుగుతుందని మంత్రి వివరించారు. రవాణా, పోలీస్ శాఖలు ఈ డిజిటల్ సర్టిఫికెట్‌ను పరిశీలించిన అనంతరం మాత్రమే పశువుల రవాణాకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ విధానం అమలులోకి రావడంతో పశువుల అక్రమ రవాణాపై సమర్థవంతమైన నియంత్రణ సాధ్యమవుతుందని, అలాగే పశుసంవర్ధక రంగంలో పారదర్శకత, బాధ్యత పెరుగుతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల సాధికారత సమాజాన్ని బలపరుస్తుంది

**○ ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్):** మహిళల సాధికారత సమాజాన్ని బలహీనపరచదు, అది సమాజాన్ని మరింత బలపరుస్తుందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ స్పష్టం చేశారు. మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించినప్పుడు సమాజంలో సానుకూల మార్పులు వస్తాయని తెలిపారు.

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలోని విజ్ఞాన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా పర్యవేక్షణలో ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే ను పురస్కరించుకుని "రైట్స్, జస్టిస్ అండ్ యాక్షన్ ఫర్ ఆల్ ఉమెన్ అండ్ గర్ల్స్" అనే అంశంపై శుక్రవారం ఘనంగా సింపోజియంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు మహిళా సాధికారత కోసం ఒకే సంవత్సరంలో ఒక లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టారని, ఆ లక్ష్యాన్ని విజయవంతంగా సాధించినట్లు తెలిపారు. మహిళలు వ్యాపార రంగంలో ముందుకు రావడానికి ప్రభుత్వం పలు ప్రోత్సాహక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళలు తమ హక్కులను తెలుసుకున్నప్పుడే న్యాయం



పొందగలరని ఆమె స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థ బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పనిచేసినప్పుడే సమాజంలో నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, న్యాయ విద్యార్థులు సమాజంలో చైతన్యం కల్పించే వంతెనలా పనిచేయాలని సూచించారు. అవసరంలో ఉన్న ప్రజలకు సహాయం చేయడం ద్వారా న్యాయపరమైన అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

ఇటీవలి కాలంలో డిజిటల్ వేదికల్లో మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లలో ఈ సమస్యలు గణనీయంగా పెరిగినట్లు తెలిపారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవడం అవసరమని పేర్కొన్నారు.

ప్రయాణాల సమయంలో కూడా మహిళలు భద్రతా సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ సమాజంలో భద్రతా భావన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

మహిళలపై జరిగే వేధింపుల కారణంగా అనేక మంది ఉద్యోగాలు వదిలేయాల్సి వస్తోందని తెలిపారు. మహిళలకు సురక్షితంగా పని చేయగల వాతావరణాన్ని కల్పించడం సంస్థల బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వన్ స్టాప్ హెల్ప్‌లైన్ సెంటర్లు మహిళలకు మంచి సేవలు అందిస్తున్నాయని ఆమె తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే జీరో ఎఫ్ఐఆర్ వంటి చట్టపరమైన అవకాశాల గురించి మహిళలకు అవగాహన ఉండాలని అన్నారు. ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఫిర్యాదు నమోదు చేసుకునే అవకాశం జీరో ఎఫ్ఐఆర్ ద్వారా లభిస్తుందని వివరించారు.

మహిళల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు మహిళా కమిషన్ ఆధ్వర్యంలో డిజిటల్ ఫిర్యాదు వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు ఆమె తెలిపారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయని, వాటిని తొలగించేందుకు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మహిళల గౌరవం, భద్రతను కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు. భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులను కల్పించినప్పటికీ, ఆ హక్కులు ఆచరణలో పూర్తిగా అమలయ్యేలా సమాజం, సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయం, గౌరవం, సమానత్వం, అవకాశాలు వంటి అంశాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

మహిళా సాధికారత నినాదంగా కాకుండా ఆచరణలోకి రావాలని ఆమె అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతులు విద్యతో పాటు స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో అడుగు పెట్టాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబన కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే కాకుండా దేశ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు.

పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు ప్రభుత్వం తీసుకొచ్చిన పోష్ చట్టం వంటి చట్టాలను ప్రతి సంస్థలో కచ్చితంగా అమలు చేయాలని ఆమె సూచించారు. చాలా మంది మహిళలకు ఈ చట్టాల గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదు కమిటీలు సమర్థవంతంగా పని చేయాలని, విద్యార్థులు, ఉద్యోగులు తమ హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు.

ఈ సింపోజియంలో మహిళల హక్కులు, చట్టపరమైన రక్షణలు, సామాజిక బాధ్యత, మహిళా సాధికారత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, న్యాయ నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులు మరియు పలు రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళల హక్కుల పరిరక్షణకు సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.



## కారుమంచి కృష్ణవేణి కి ఘనంగా నివాళులర్పించిన గోగులమూడి రాజు

**నరసరావుపేట, మార్చి 06 (జర్నలిస్ట్ ఫైల్)**

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్ పాల్ సోదరి,కారుమంచి కృష్ణవేణి చిత్రపటానికి మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇటీవలస్వర్గస్తులైన కృష్ణవేణి జ్ఞాపకార్థ కూడిక వారి స్వగ్రామము నరసరావుపేట బాపనయ్య నగరలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు పాల్గొని స్వర్గీయ కృష్ణవేణి చిత్రపటానికి స్థానిక నాయకులతో కలిసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం వారి కుటుంబ సభ్యులకు గోగులమూడి రాజు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.వారితో పాటు కృష్ణాజిల్లా మాల మహానాడు నాయకులు, గంజి రాజ్ కుమార్, పైయర్థ రామకృష్ణ, సరిహద్దు ఆందోని, మరియు కీర్తి కీర్తిపాటి వెంకటేశ్వరరావు, కంచర్ల రాజ్ కుమార్, గోదా బాల, జయరాజు,,గోదా స్టీవెన్, సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వేసవి దృష్ట్యా త్రాగు నీటి సమస్యలు లేకుండ చూడాలి

### ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ

### సర్పంచులను సన్మానించిన ఎంపీపీ, ఎంపీడీఓ



**జి.కొండూరు, మార్చి 06 (జర్నలిస్ట్ ఫైల్)**

మైలవరం నియోజకవర్గం, జి.కొండూరు మండలం, జి.కొండూరు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించడం జరిగింది. అధికారులు శాఖల వారీగా సమీక్షలు నిర్వహించారు. గ్రామ సర్పంచులు గా ఐదేళ్ల కాల పరిమితిని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయా గ్రామ సర్పంచులను శాలువతో సత్కారించి మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో త్రాగు నీటి సమస్య లేకుండా చూడాలని, అధికారులు, ప్రజాప్రతినిధులను అన్ని కార్యక్రమాల్లో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.గ్రామాల్లో అభివృద్ధి పనుల కొరకు నిధులు మంజూరు చేస్తునట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ , వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు , ఈలప్రోలు తేజ శ్రీ ,ఇంచార్జి తాసిల్దార్ విజయ్ కుమార్ ,ఎంపీటీసీలు, సర్పంచ్ లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


## ఎమినెంట్ సైంటిస్ట్ అవార్డ్-2025 అందుకున్న డా. జె. రాముడు

**మైలవరం, మార్చి 06 (జర్నలిస్ట్ ఫైల్)**



స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హనీమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్న డా. జె. రాముడు కి నేషనల్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అకాడమీ , ఇండియా వారు ప్రతిష్టాత్మకమైన ఎమినెంట్ సైంటిస్ట్ అవార్డ్–2025 కు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఇళ్ల రవి తెలిపారు. డా. జె. రాముడు వృక్షశాస్త్రంలో ముఖ్యంగా ఆర్కిడ్ మొక్కలపై విశేష పరిశోధనలు నిర్వహిస్తూ ఇప్పటివరకు 20కి పైగా పరిశోధనా పత్రాలు, నాలుగు పేటెంట్లు, ఆరు బుక్ చాప్టర్లు ప్రచురించారు. అదనంగా ఆర్కిడ్ మొక్కలపై ఒక పుస్తకాన్ని కూడా రచించారు. ఆర్కిడ్ మొక్కలపై ఆయన చేసిన పరిశోధనలకు గుర్తింపుగా నేషనల్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అకాడమీ , ఇండియా వారు ఈ ఎమినెంట్ సైంటిస్ట్ అవార్డ్--2025 ను ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## ఎమ్మెల్యే యార్లగడ్డకి గ్రామస్తుల కృతజ్ఞతలు





**ఉంగుటూరు, మార్చి 06 (జర్నలిస్ట్ ఫైల్)**

కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఓంద్రంపాడు గ్రామంలో ఎప్పటినుంచో అపరిష్కృతంగా ఉన్న జిల్లా పరిషత్ రోడ్డుకు ఎనర్జీయస్ ద్వారా నిధులు మంజూరు చేసి తారు రోడ్ ని నిర్మాణం పూర్తి చేయించి గ్రామస్తుల రహదారి ఇబ్బందులు తొలగించిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కి ఓంద్రంపాడు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గత 16 ఏళ్లుగా ఈ రోడ్డు గుంటలు పడిపోయి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడిన గ్రామస్తులకి తారు రోడ్డు నిర్మాణంతో సుఖవంతమైన ప్రయాణానికి అనుకూలంగా ఉండటంతో కూటమి ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ కు మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

# సరైన అవగాహనతోనే విపత్తులపై విజయం

### ఈ నెల 28వ తేదీ వరకు ఎన్డీఆర్ఎఫ్ ఫామెక్స్-2026

- కార్యక్రమాల సత్ఫలితాలపై సమన్వయ శాఖలు దృష్టిపెట్టండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, మార్చి 06 (జర్నలిస్ట్ ఫైల్)**

విపత్తులపై సరైన అవగాహన, ముందస్తు సన్నద్ధతతోనే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనగలమని.. ఈ క్రమంలో సామాజిక చైతన్యం లక్ష్యంగా జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లాలో ఫెమిలియరైజేషన్ ఎక్సర్‌సైజ్ (ఫామెక్స్)–2026 కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఎన్డీఆర్ఎఫ్ ఫామెక్స్–2026పై కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధ్యక్షతన సమన్వయ శాఖల జిల్లాస్థాయి అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొండపావులూరు ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్ సారథ్యంలో బృంద సభ్యులు పాల్గొన్నారు. 3,31,618 హెక్టార్ల జిల్లా భౌగోళిక విస్తీర్ణంలో వరదలు వంటి విపత్తులు సంభవించేందుకు అవకాశమున్న ప్రాంతాలు, ఆయా ప్రాంతాల్లో సన్నద్ధత చర్యలు, జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక (డీడీఎంపీ)తో పాటు రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీరాజ్, పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, వ్యవసాయం తదితర సమన్వయ శాఖల భాగస్వామ్యం తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల్లో విపత్తులపై అవగాహన పెంపొందించేందుకు, ఎన్డీఆర్ఎఫ్ భాగస్వామ్యాన్ని వివరించేందుకు ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫామెక్స్ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించడంలో కీలక భాగస్వాములు కావాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం జిల్లా వ్యాప్తంగా 15 రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలలు, వివిధ పరిశ్రమలతో పాటు నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (ఎన్‌వైకేఎస్), ఆపద మిత్ర, ఎన్ఎస్ఎస్ తదితర వాలంటీర్లతో గౌరవ ప్రజాప్రతినిధుల సహకారంతో సామాజిక అవగాహన–సన్నద్ధతా కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

### ప్రజల్లో భద్రతా చైతన్యం లక్ష్యం: భూపేంద్ర కుమార్...

20 సభ్యుల ఎన్డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో ఫామెక్స్ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భద్రతా చైతన్యం పెరుగుతుందని.. తద్వారా విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించగలమని ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్ అన్నారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విపత్తు నిర్వహణ సామర్థ్య నిర్మాణంతో పాటు ప్రాథమిక చికిత్స, నేలకొరిగిన నిర్మాణాల్లో సెర్చ్, రసాయన, జీవ విపత్తులకు సంబంధించిన స్పందన, అగ్ని ప్రమాదాలు, తుపాన్లు, భూకం పాలు వంటివాటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సమాజంలో విపత్తులపై ముందస్తు సన్నద్ధతను పెంపొందించడం, ప్రమాద సమయంలో ప్రజలు భయాందోళనలకు గురికాకుండా సమర్థంగా వ్యవహరించేలా చైతన్యం కల్పించడం అని భూపేంద్రకుమార్ వివరించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు కె.వెంకటశ్వర్లు, ఎస్ఆం కేజీ వెంకట్, ఐ.హరికృష్ణ, విజయవాడ ఆర్డీవో టి.వి. సతీష్, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలుగు తేజం మరిన్ని కీర్తి శిఖరాలు అధిరోహించాలి

- క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా చేయూత
- అర్జున అవార్డు గ్రహీత సాకేత్ మైనేనితో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 06 (జర్నలిస్ట్ ఫైల్)**

అర్జున అవార్డు గ్రహీత సాకేత్ మైనేని టెన్నిస్ క్రీడా ప్రపంచంలో మరిన్ని కీర్తి శిఖరాలు అధిరోహించాలని.. క్రీడా ప్రతిభకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సాకేత్ మైనేనికి రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం కల్పిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. క్రీడల కోటాలో ఎన్టీఆర్ జిల్లాలో డైరెక్ట్ రిక్రూటీగా డిప్యూటీ కలెక్టర్‌గా ఆయన్ను నియమించింది. ఈ నేపథ్యంలో సాకేత్ జాయినింగ్ రిపోర్టు సమర్పించిన సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను గురువారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ లక్ష్మీశ.. సాకేత్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సాకేత్.. ఏషియన్ గేమ్స్ సహా ప్రఖ్యాత అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకాలు సాధించారని.. ఇదేవిధంగా ముందడుగు వేసేందుకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని తెలిపారు. అంతర్జాతీయ సర్క్యూట్‌లో విజయాల పరంపరతో ఏటీపీ ర్యాంకింగ్ లో దూసుకెళ్లాలని.. భవిష్యత్తు క్రీడా పోటీల్లో మరిన్ని విజయాలు సొంతం చేసుకొని జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకొస్తారని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో జిల్లా యంత్రాంగం ద్వారా అవసరమైన అన్ని సహాయసహకారాలు అందిస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. వచ్చే వారంలో ఏటీపీ ఛాలెంజర్ టూర్ కు సంబంధించి ఐరోపా పర్యటనకు వెళ్తున్నట్లు సాకేత్ చెప్పగా కలెక్టర్ లక్ష్మీశ శుభాకాంక్షలు తెలిపారు.



# ఇబ్రహీంపట్నంలో నీతి ఆయోగ్ అధికారి పర్యటన విజయవంతం

**ఇబ్రహీంపట్నం, మార్చి 06 (జర్నలిస్ట్ ఫైల్)**



నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆకాంక్షిత బ్లాకు కార్యక్రమం (ఏబీపీ)–సంపూర్ణతా అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా నీతి ఆయోగ్ అధికారి రాధికా ములే గురువారం ఇబ్రహీంపట్నం మండలంలో సందర్శించారు. పర్యటనలో భాగంగా ఆమె మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం, ప్రభుత్వ పాఠశాల, పశుసంవర్ధక శాఖ కార్యాలయం, రైతు సేవా కేంద్రం తదితరాలను సందర్శించి అక్కడ అందుతున్న సేవలు, అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను పరిశీలించారు.అదే విధంగా గుంటుపల్లి గ్రామంలోని RISE (Rural Incubation Skilling and Entrepr eneurship) సెంటర్ ను కూడా సందర్శించి అక్కడ మహిళలకు అందిస్తున్న నైపుణ్య శిక్షణలు, ఉపాధి అవకాశాలు మరియు స్వయం ఉపాధి కార్యక్రమాల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆకాంక్షిత బ్లాకు కార్యక్రమం కింద నిర్దేశించిన ఆరు కీలక పురోగతి సూచికలు (కేపీఐ) పూర్తిస్థాయిలో సాధించేందుకు ఇబ్రహీంపట్నం మండల అధికారులు కృషి చేస్తున్నారని రాధికా ములే గారు అభినందించారు. మండలంలో కార్యక్రమాల అమలు సమర్థవంతంగా జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ ఆధ్వర్యంలో సంపూర్ణతా అభియాన్ 2.0 కార్యక్రమం జిల్లాలో సమర్థవంతంగా అమలవుతూ మంచి ఫలితాలు సాధిస్తోందని ఆమె తెలిపారు.అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి, వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాల పురోగతిపై సమీక్ష చేపట్టారు. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో పరస్పర చర్చ జరిపి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడిఓ శకుంతల, ఎంఆర్ ఓ వై.వెంకటేశ్వర్లు, ఎంఏవో రజని, ఎంఈవో పుష్పలత, ఎంవో పర్వీన్, ఏబీపీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడిఓ మనోజ్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పాలు, నెయ్యితో పాడిరైతుకు సుస్థిర ఆదాయం

- సరైన అవగాహనతో రైతులు ముందడుగు వేయాలి
- దేశీయ గోజాతి పాల ఉత్పత్తులతో ఇటు రైతులకు, అటు వినియోగదారులకు మేలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 06 (జర్నలిస్ట్ ఫైల్)**



దేశీయ గోవుల నుంచి ఉత్పత్తి అయ్యే ఏ2 పాలు, నెయ్యి ద్వారా పాడి రైతులు మంచి ఆదాయాన్ని పొందవచ్చని .. సరైన అవగాహనతో, సంప్రదాయ–ఆధునిక పాడి పరిశ్రమ పద్ధతులను అనుసరిస్తూ దేశీ జాతి ఆవులను పెంచితే రైతులకు సుస్థిర ఆదాయం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ గురువారం వత్సవాయి మండలం, కంభంపాడులోని చేకూరి రమేష్‌బాబుకు చెందిన సాయిశ్రీనివాస గోశాలను సందర్శించారు. ఈ గోశాలను ఆర్‌కేవీఐ పథకం కింద 2021లో రూ. 15 లక్షల రాయితీతో ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం సాహివాల్, గిర్, పుంగనూరు, ఒంగోలు తదితర దేశీ జాతులకు చెందిన 55 ఆవులతో విజయవంతంగా ముందుకెళ్తోంది. ఇక్కడి ఆవుల నుంచి వచ్చే పాలతో ప్రీమియర్ క్వాలిటీ ఏ2 నెయ్యి తయారుచేస్తున్నామని.. నెలకు దాదాపు 60 కిలోల నెయ్యిని ఉత్పత్తి చేస్తున్నామన్నారు. లీటరు నెయ్యిని రూ. 3,000కు మార్కెటింగ్ చేయడం జరుగుతోందన్నారు. సంప్రదాయ విధానంలో పాలను మరిగించి, పెరుగు చేసి, ఆపై చిలకడం ద్వారా వచ్చే వెన్నతో నెయ్యిని తయారుచేస్తున్నట్లు వివరించారు. ఆరోగ్యప్రదాయిని అయిన ఈ నెయ్యికి డిమాండ్ ఉందన్నారు. అదేవిధంగా పంచగవ్య, ద్రవ జీవామృతం కూడా తయారుచేస్తున్నామని వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేయడంతో పాటు రైతులకు లాభదాయకంగా మారేలా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా దేశీ జాతి ఆవుల నుంచి వచ్చే A2 పాలు, వాటితో తయారు చేసే నెయ్యి, పెరుగు వంటి పాల ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. వీటి వినియోగం ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు రైతులకు అధిక ధర లభించే అవకాశం ఉందని వివరించారు. దేశీ జాతి ఆవుల పెంపకంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని, పశువుల పోషణ, సంరక్షణ, పాల ఉత్పత్తి పెంపు వంటి అంశాల్లో పశుసంవర్ధక శాఖ అధికారులు అందించే సాంకేతిక సూచనలను సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఔత్సాహిక రైతులను గుర్తించి వారిని సంఘటితం చేసి ఏ2 పాలు, నెయ్యి ఉత్పత్తి చేసేలా చేయూతనివ్వాలని కలెక్టర్ లక్ష్మీశ పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, జిల్లా పశుసంవర్ధక అధికారి డా. ఎం.హనుమంతరావు, ఏడీ సత్యప్రసాద్, స్థానిక అధికారులు ఉన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నైపుణ్యాభివృద్ధి వర్క్ షాప్‌లు సక్రమంగా నిర్వహించాలి



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్):జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ఆర్ఎఎంపీ ద్వారా నైపుణ్యాభివృద్ధి వర్క్ షాప్ లు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కలక్టరేట్ లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ( డీఐఈపీసీ) సమావేశం జరిగింది. సమావేశం అజెండా అంశాలపై జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఆర్ఎఎంపీ ద్వారా వెండర్ డెవలప్మెంట్, ఉద్యమ్, ఈఎస్డీపీ తదితర వర్క్ షాప్ లు ఎంఎస్ఎంఈలు, అమ్మకదారులకు , తయారీదారులు వ్యాపార నెపుణ్యాలపై శిక్షణ ఏజెన్సీలు సక్రమంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ పరిశ్రమలు శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సింగల్ విండో ద్వారా అందించిన దరఖాస్తులను విత్ ఇన్ ఎస్ ఎల్ ఏ లోనే అనుమతులు మంజూరు చేయాలన్నారు. పీఎంఈజీపి, ముద్రా , పీఎంఎఫ్ఎంఈ, స్టార్టప్ ఇండియా, మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజస్ కి నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసి నూరుశాతం గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పరిధిలో క్యాబినెట్ ఆమోదించింది ఎంవోయూ పరిశ్రమలు ఏర్పాటు కు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వివిధ పరిశ్రమల రాయితీలకు సంబంధించి 15 క్లెయిమ్స్ కు రూ. 3,39,06,843/- మంజూరు చేస్తూ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆమోదించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఏ జయలక్ష్మి, , ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎంఎల్ఎన్ రావు, డిపిఓ సాయికుమార్, జిల్లా ఉపాధి అధికారి దుర్గా బాయి, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి, డీఆర్డీఏ పిడీ విజయలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డిడి చెన్నయ్య, ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర బాబు. డిసిఎల్ఏ. గాయత్రి దేవి ,జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సంజీవరావు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి, సీపీడీసీఎల్, ఆర్టీఓ శ్రీహరి, సిక్కి ఆర్ఎం పరిమళ, డీఐసీసీఐ జిల్లా కో ఆర్డినేటర్ కె పావని తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యభాగ్యమే లక్ష్యంగా డిత్రీ సర్వీసెస్ సొసైటీ వైద్యసేవలు : డాక్టర్ శారద



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): ఆరోగ్యభాగ్యమే లక్ష్యంగా క్యాన్సర్ రహిత సమాజం దిశగా జీవనశైలి ఆహారపు అలవాట్లు అంతా సవ్యంగా ఉన్న మహిళలకు ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించి, ఎటువంటి అనారోగ్య సమస్య, రానున్నది, ప్రస్తుతం ఏస్థాయిలో ఎటువంటి సమస్యఉందో గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే తమ విధానమని డాక్టర్ శారద మహిళలనుద్దేశించి అన్నారు. మండలంలోని నందివెలుగు గ్రామంలోని కళ్యాణ మండపంలో శుక్రవారం క్యాన్సర్ మరణాలను నియంత్రించడమే లక్ష్యంగా డి3 శారద సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

గత నెల 23నుండి 26వరకు మహిళలకు, రక్తపరీక్షలు,స్కానింగ్, అల్ట్రా సౌండ్,వైద్య పరీక్షలు నిర్వహించారు. 188 మహిళలకు వివిధ వైద్యపరీక్షలు నిర్వహించగా, 38 మందికి పలు అనారోగ్య సమస్యలు ప్రాథమిక స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల వెంకట నాగ పవన్ కుమార్ మాట్లాడుతూ డి 3 శారద సర్వీసెస్ సొసైటీ ద్వారా, డాక్టర్ శారదశ చేపడుతున్న వైద్యసేవా కార్యక్రమాలను ప్రశంసించారు.

క్యాన్సర్ రహిత సమాజం దిశగా, గ్రామాలను దత్తత తీసుకొని మహిళలకు అత్యధిక ప్రమాణాలతో కూడిన, వ్యాధి నిర్ధారణ పరికరములతో,వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధులను ముందస్తుగా గుర్తించడం, వైద్య సేవలు అందించడం పట్ల హర్షం వెలి బుచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వారికి మెడికల్ రిపోర్ట్ లను అందజేసిన డాక్టర్ శారద ఆరోగ్యపరంగా పలు సూచనలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బి హేమ కుమారి, డిత్రి శారద సర్వీసెస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## కల్తీని ఒక ప్రాణాంతక విపత్తుగా గుర్తించి, దానిపై ఉక్కుపాదం మోపాలి

○ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో కల్తీ ఆహార అంశాన్ని లేవనెత్తిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):ఆహార కల్తీని ఒక ప్రాణాంతక విపత్తుగా గుర్తించి, దాని పై ఉక్కుపాదం మోపాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలగపూడిలో జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలో పెరుగుతున్న ఆహార కల్తీ సమస్యపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ "ఆహారమే ఔషధం" అని మన పెద్దలు చెప్పారని, కానీ నేడు అదే ఆహారం విషంగా మారుతున్న పరిస్థితిని మనం చూస్తున్నామని, లాభార్జనే లక్ష్యంగా బియ్యంలో రాళ్లు కలపడం నుండి ప్రారంభమైన కల్తీ, నేడు పవిత్ర ప్రసాదం వరకు చేరుకుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కల్తీ కారణంగా ప్రజల జీర్ణ వ్యవస్థ, నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినడమే కాకుండా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కూడా కారణమవుతోందని పేర్కొన్నారు.

కల్తీకి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు లేకపోవడం, సమర్థవంతమైన తనిఖీ వ్యవస్థ లేకపోవడం వల్ల ఆహార కల్తీ విచ్చలవిడిగా పెరుగుతోందని అన్నారు. 2014-19 కాలంలో ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్ ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్ 100 పాయింట్లకు 47 పాయింట్లతో 10వ స్థానంలో ఉన్నదని గుర్తుచేశారు. ఆ పరిస్థితిని గమనించిన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2018లో జీవో జారీ చేసి సిబ్బంది కొరత తీర్చేందుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు.

అయితే గత వైసీపీ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకుండా ఆ జీవోను అమలు చేయకపోవడంతో 2023 నాటికి ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ 100కి 22 పాయింట్లతో 28వ స్థానానికి పడిపోయిందని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం, కొంతమంది సిబ్బందిని నియమించడం ద్వారా రాష్ట్రం చిట్టచివరి స్థానం నుండి క్రమంగా మెరుగుపడుతున్నదని పేర్కొన్నారు.

అయినప్పటికీ జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఇంకా సిబ్బంది కొరత ఉందని, తనిఖీ వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. నియంత్రణ లేకుండా హోటళ్లు, చిరుతిళ్ల బండ్లు పెరుగుతున్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ, అగ్మార్క్ వంటి ప్రమాణాలపై ప్రజల్లో కొంత అవగాహన ఉన్నప్పటికీ, హోటళ్లలో వడ్డించే ఆహారంపై కూడా జాగ్రత్త అవసరమని అన్నారు.

ఇందుకు ప్రభుత్వం విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆహార కల్తీని సాధారణ సమస్యగా కాకుండా రాబోయే ప్రాణాంతక విపత్తుగా గుర్తించి, కల్తీకి పాల్పడేవారిపై కఠిన శిక్షలు అమలు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కోరారు.

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ స్పందిస్తూ...**

రాష్ట్రంలో ఆహార భద్రతను కాపాడేందుకు ఫుడ్ సేఫ్టీ శాఖ ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఆహార వ్యాపార నిర్వాహకులు తప్పనిసరిగా నమోదు చేసుకోవడం లేదా లైసెన్స్ పొందడం ద్వారా భద్రతా ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నోటిఫైడ్ ప్రయోగశాలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు, ఆకస్మిక దాడులు నిర్వహిస్తూ ఆహార నమూనాలను సేకరించి పరీక్షిస్తున్నామని తెలిపారు. 2023-24నుండి జనవరి 2026వం-కు మొత్తం 16,730 ఆహార నమూనాలను పరీక్షించగా, అందులో 1,407 నమూనాలు నాణ్యత లేనివిగా లేదా తప్పుడు బ్రాండింగ్ ఉన్నవిగా గుర్తించినట్లు వెల్లడించారు. వాటిపై కోర్టుల్లో ప్రాసిక్యూషన్ నమోదు చేసి జరిమానాలు విధించడం వంటి చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు.

## ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేసిన జిల్లా మలేరియా అధికారి



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):కొల్లిపర మండలం కొల్లిపర గ్రామం లో శుక్రవారం జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం తనిఖీ చేశారు. స్థానిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ ఘంట నేహారెడ్డి సిబ్బందితో కలిసి కొల్లిపర మాయాబజార్ , హోలీ క్రాస్ హై స్కూల్ ప్రాంతం పల్లెల యందు దోమల నివారణ కు తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలపై నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు . గ్రామాలోని ప్రతి ఇంటిని సందర్శించి దోమలగుడ్లు పెట్టుటకు అవకాశం ఉన్న మూలాలను పరిశీలించి తొలగింప చేయించారు. జీవించి ఉన్న లార్వాలను చూపించి విశదీకరించి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించారు.

స్థానిక పంచాయతీ వారితో కలిసి కాల్వలలో లార్వాలను నిర్వీర్యం చేసే ముందును పిచికారి చేయించారు. ఆరోగ్య సిబ్బందిచే ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బారాయణం మాట్లాడుతూ ప్రజలు దోమలు దోమలు గుడ్లు పెట్టే ప్రదేశాలపై అవగాహన కల్పించడం ద్వారా దోమ పుట్టుకను ఆపవచ్చునని తద్వారా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులైన మలేరియా ,డెంగ్యూ ,చికెన్ గునియా, బోదకాలు, మెదడువాపు వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చునని తెలిపారు. ముఖ్యంగా దోమలు ఇంటి బయట నీటి నిల్వ ఉన్న ప్రదేశాలలో, ఇంటి లోపల ఫ్రిజ్ వెనుక భాగంలోను ,కూలర్లలో గుడ్లు పెడతాయని, ఇంటి బయట రుబ్బురోలు పూల కుండీలు డ్రమ్ములు గాబులు కొబ్బరి బోండాలు మూతలు లేని ఓవర్ హెడ్ ట్యాంకులు టైర్లు నీరు నిల్వ ఉన్న పల్లపు ప్రాంతాలలో తమ గుడ్లను పెట్టి తమ సంతతిని అభివృద్ధి. చేస్తాయని అన్నారు. ఇంటి బయట, లోపల వారానికి ఒక్కసారైనా నీటి నిల్వలను మార్చుకొవాలని తెలిపారు . వైద్యాధికారిని డాక్టర్ స్నేహారెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడేవారు మున్నంగి మరియు కొల్లిపర ప్రభుత్వ ఆసుపత్రిలో ఎవరైనా సంప్రదించి ఉచిత పరీక్షలు చేయించుకుంటమే కాక మందులను కూడా ఉచితంగా పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో తెనాలి సహాయమలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, ఇన్ చార్జ్ సబ్ యూనిట్ అధికారి అందె బాలచంద్రమౌళి, తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, గుంటూరు సబ్ యూనిట్ అధికారి సూద శివగణేష్,మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి తుమ్మానాగరాజు ఎంఎల్ హెచ్ పిలు, ఏఎన్ఎం వేము లక్ష్మి , హెల్త్ అసిస్టెంట్స్ గంగవరపు శ్రీనివాసరావు, కిరణ్ మోడీ, ఆశా కార్యకర్తలు జయప్రద ,భవాని, మల్లేశ్వరి ,సుబ్బులు, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అచ్చెం నాయుడు దిష్టిబొమ్మ దగ్ధం చేసిన వైసిపి ఎస్సీ సెల్ నాయకులు



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): శాసనమండలి సమావేశాలలో ఈనెల నాలుగో తేదీ బుధవారం చోటుచేసుకున్న ఘటన ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి రోజుగా నిలిచిపోతుందని వైఎస్ఆర్‌సిపి ఎస్సి సెల్ నాయకులు మంత్రి అచ్చెం నాయుడు శాసనమండలిలో అనుసరించిన వ్యవహార శైలిపై విమర్శలు గుప్పించారు. స్థానిక గంగానమ్మపేట లోని వైసిపి కార్యాలయంలో వైఎస్ఆర్ సిపి ఎస్సీ సెల్ నాయకులు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. పలువురు ఎస్సి సెల్ స్థానిక నాయకులు మాట్లాడుతు రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నటువంటి ఒక వ్యక్తిని గౌరవించాల్సింది పోయి, అవమానించడం లక్ష్యంగా చేసుకొని కులము మతము పేరుతో,కూటమి నాయకులు మండలి లో అనుసరిస్తున్న తీరు చట్టసభల సంస్కృతికి విరుద్ధంగా ఉందని ఆరోపించారు. కుల మతాలకు అతీతంగా ప్రజాస్వామ్యం స్ఫూర్తితో పని చేస్తామని ప్రమాణం చేసి,పదవి చేపట్టిన , మంత్రి అచ్చం నాయుడు మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని,మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, ప్రస్తుత మండల చైర్మన్ కె. మోషన్ రాజు లపై, కుల పరంగా మత పరంగా విమర్శలు చేయడం అమానుషం అన్నారు. చైర్మన్ స్థానంలో ఉన్నటువంటి వ్యక్తి కి ఒక కులాన్ని మతాన్ని ఆపాదించడం చాలా దుర్మార్గం అన్నారు. ప్రోటోకాల్ విషయంలో తిరుపతి మహిళా పార్లమెంట్ నిర్వహించిన సందర్భంలో,అదే విధంగా ఏలూరు జిల్లాలో అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రారంభోత్సవ,కార్యక్రమాలలో శిలాఫలకాలలో పేరు లేకపోవడం చాలా బాధాకరం అన్నారు. మోషన్ రాజుఒక దళితుడనా, లేక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో చైర్మన్ అయ్యారనా ఈ విధంగా ఆయన్ని మానసిక క్షోభకు గురి చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి నాయకులు మనస్సాక్షి ప్రకారం నడుచుకోవాలి రేపటి రోజున వీటన్నిటికీ సమాధానం చెప్పాల్సిన రోజు తప్పకుండా వస్తుందన్నారు మండలి లో జరిగిన అంశాన్ని తెనాలి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ తరపున ఖండిస్తున్నమని, మంత్రి అచ్చం నాయుడు ను, మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు. అనంతరం మార్కెట్ సెంటర్ అన్నా క్యాంటిన్ వద్ద, మంత్రి అచ్చెం నాయుడు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో అక్కిదాసు కిరణ్ కుమార్, ఉన్నం అనీష్, కటెవరపు దేవానంద్, పినపాటి రవికిరణ్, బండ్లమూడి నాని, గొరికపూడి బాలరాజు, అత్తోట అమృతరాజు, కాకి దేవసహాయం, పిల్లి గంగాధర్, మంద్రురాజు, దర్శిరవితేజ, వంపుగళ్ళకృష్ణ, బడుగు కోటయ్య పార్టీ ఎస్సీ సెల్ బాధ్యులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది సమస్యలపై స్పందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది నుండి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది తమ వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని శ్రద్ధగా ఆలకించిన ఎస్పీ, సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివిధ ఘటనల్లో శాఖాపరమైన చర్యలు ఎదుర్కొంటున్న సిబ్బంది విషయాన్ని విచారణ అనంతరం పరిశీలించి, అవసరమైన చోట విధుల్లోకి తిరిగి తీసుకునే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది తమ విధుల్లో నిబద్ధత, నిజాయితీ, బాధ్యతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది స్వేచ్ఛగా తమ బాధ్యతలు నిర్వర్తించేలా అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఎస్పీ తెలిపారు.

## జాతీయ ఉపకార వేతనానికి బాలికల పాఠశాల విద్యార్థులు ఎంపిక



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ): బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని గోవిందమాంబ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు 2025 26 విద్యా సంవత్సరానికి సంబంధించిన జాతీయ ఉపకార వేతనం పథకం (ఎన్ ఎం ఎం ఎస్) పరీక్షలు గుర్తింపు సాధించి ఉపకార వేతనానికి అర్హత సాధించారు వీరిలో 8వ తరగతి విద్యార్థి చిత్రాల సుమ మరియు జంపింగ్ రేఖ ఇద్దరు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓ లక్ష్మణ స్వామి రెడ్డి విజయలక్ష్మి తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విద్యను అభ్యసిస్తూ జాతీయస్థాయి అర్హత పరీక్షలు వర్తిన్నత సాధించి ఇంతటి గొప్పదైన జాతీయ ఉపకార వేతన పథకానికి అర్హత సాధించినందుకు మా విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామని ఈ విజయానికి మా ఉపాధ్యాయుల కృషి అంకితభావం నిరంతర ప్రోత్సాహం ఈ ఫలితాలు సాధించాలని ఒక నిదర్శనమై ఆయన తెలియ చెప్పారు ఈ విద్యార్థులు ఇంతటి విజయం సాధించడం వెనక రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులు లెక్కల కొండారెడ్డి కృషి అభినందనీయమని వారు విద్యార్థులను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ పరీక్ష వరకు తీసుకెళ్లి విజయం సాధించడానికి ప్రధానంగా కృషి చేశారని ఇంకా రానున్న రోజుల్లో విద్యార్థులను ఇటువంటి జాతీయ ఒక్కరివేతన పథకాలలో మరిన్ని పోటీ పరీక్షల్లో విజయవంతంగా విజయం సాధించడం కోసం మా పాఠశాల ఉపాధ్యాయులు బృందం ఎప్పటికి కృషిచేస్తుందని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల్ బి పరిమళ చంద్రిక పుష్పలత సంధ్యారాణి చెన్నమ్మ ఎల్జిబిత్ రాణి తదితరులు పాల్గొన్నారు

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌కు ఎంపిక



కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ కు కాకుమాను మండలం కాకుమాను జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి ఇద్దరు విద్యార్థినీలు ఎంపికయ్యారు. హై స్కూల్ నందు 8 వ తరగతి చదువుతున్న బొనిగల శరణ్య, రుద్రపాటి హాసిని అను ఇరువురు విద్యార్థులు అర్హత సాధించ్చినట్లు తెలియజేసారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి 12 వేల రూపాయలు లభిస్తాయి. వీరికి 9 వ తరగతి నుండి 12 వ తరగతి వరకు (నాలుగేళ్ల పాటు ) ప్రతి నెల వెయ్యి రూపాయల చొప్పున విద్యార్థిని బ్యాంకు ఖాతలో జమ అవుతాయన్నారు. మండలం విద్యా శాఖ అధికారులు కె ఎఫ్ కేనెడి, విజయ భాస్కర్ లు ఉపాధ్యాయ బృందం ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):సివిల్ కేసులో దశాబ్ధకాలం పైగా కోర్టు చుట్టూ తిరుగుతు తమ తరపు న్యాయవాది తమకు న్యాయం చేయకపోగా తీసుకున్న దస్తావేదులు తిరిగి ఇవ్వకుండా వేదనకు గురిచేస్తున్న తీరు పై విరక్తి చెంది, మనస్తాపంతొ మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు కోర్టు భవనాల ప్రాంగణంలొ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడగా,అప్రాంత వాసులు అడ్డుకున్న ఉదంతమిది. స్థానిక కొత్తపేటలోని కోర్టు ప్రాంగణం వద్ద పెట్రోల్ పోసుకొని మహిళా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. ఆ మహిళలను అడ్డుకున్న స్థానికులు ఆమెను వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. బాదితురాలి కదనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఐతానగర్ కు చెందిన మంద్రు కమల తెనాలి మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తు జీవనం సాగిస్తుంది. కమల అక్క కొడుకు కట్టుపల్లి సుమన్, కమల తల్లి ఆస్తిని అన్యాయంగా స్వాధీనం చేసుకున్నాడని, సివిల్ కేసు వేసి,కొన్ని సంవత్సరాలుగా కోర్టులు చుట్టూ తిరుగుతున్నా,న్యాయం జరగ లేదంటూ ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు మంద్రు కమల వాపోయింది. తన తరపు కేసు వాదిస్తున్న న్యాయవాది, కె.రాజారత్నం కేసు వివరాలు చెప్పకపోవడం,ఇంటి దస్తావేజులు తన వద్ద పెట్టుకుని తిరిగి ఇవ్వడం లేదన్న మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డానని,గత 15ఏళ్లుగా తన తల్లితో కలిసి కోర్టు చుట్టూ తిరుగుతున్నానని,కేసు ఓ కొలిక్కి రాలేదని,ఆస్తి కాజేసిన తన అక్క కొడుకు సుమన్ ఇంత వరకు ఒక్కసారి కూడా కోర్టు కి రాలేదని, తాము ఇన్నేళ్ళుగా కోర్టు వాయిదాలకు వస్తున్నామని వాపోయింది. తను, తన తల్లి కోర్టు చుట్టూ తిరిగి విసిగిపోయామని ఆస్తి విషయం తేలక పోవడంతొ, మనోవేదనతో తన తల్లి గత సంవత్సరం ఇదే రోజున మరణించిందని,తను కూడా జీవితం మీద విసుకుచేంది ఆత్మహత్యకు పాల్పడ్డానని ఆమె ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.

# సమాజాభివృద్ధికి నాణ్యమైన మానవ వనరులే కీలకం

○ రాష్ట్ర విశ్రాంత మాజీ డిజిపి మాలకొండయ్య వెల్లడి



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్): నేటి సమాజాభివృద్ధికి నాణ్యమైన మానవ వనరులే కీలకమని ఆంధ్రప్రదేశ్ విశ్రాంత మాజీ డిజిపి మాలకొండయ్య వెల్లడించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఈనెల 5న ఏర్పాటు చేసిన విద్య- పరిశ్రమల సమ్మేళనం-2026 కొనసాగింపులో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ డిజిపి మాలకొండయ్య మాట్లాడుతూ నాణ్యమైన మానవ వనరుల ద్వారా దేశాభివృద్ధితో పాటు వ్యక్తిగత అభివృద్ధి జరుగుతుందన్నారు. విద్యాసంస్థలు,పరిశ్రమల మధ్య సత్సంబంధాలు కొనసాగినప్పుడే ఉపాధి పరంగా విద్యార్థుల అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించటానికి విద్యార్థులకు ఈ సమ్మేళనం ఎంతో దోహదపడుతుందని ఉద్ఘాటించారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్య జ్ఞానాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. భారత్ లో అధిక శాతం మంది అసంఘటిత రంగాల్లో ఉన్నారని, వారంతా సంఘటిత రంగంలోకి రావాలంటే నాణ్యత ప్రామాణికమని చెప్పారు. అధ్యాపకులు మూస పద్ధతిలో కాకుండా ప్రయోగాత్మక పద్ధతిలో బోధన చేయాలని మాలకొండయ్య పేర్కొన్నారు. సమ్మేళనం సభకు అధ్యక్షత వహించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమ్మేళనం ఎస్టీమ్డ్ పాట్రన్ రెక్టార్ ఆచార్య ఆర్. శివరాంప్రసాద్ మాట్లాడుతూ కేవలం పది రోజుల్లోనే అద్భుతమైన సమ్మేళనం ఏర్పాటు చేస్తామని, వచ్చే ఏడాది 500 కంపెనీలకు తగ్గకుండా అతిపెద్ద సమ్మేళనం ఏర్పాటు చేసి బహుళ జాతి సంస్థలను భాగస్వామ్యం చేస్తామన్నారు. కృత్రిమ మేధ లాంటి సాంకేతికతను అందుకోలేకపోతే జీవనోపాధికి దూరమయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. నేడు ప్రపంచవ్యాప్తంగా 14 కోట్ల మంది సాఫ్ట్వేర్ లాంటి సాంకేతిక ఉద్యోగాల్లో రాణిస్తున్నారని, సాంకేతిక రంగంలో కూడా విద్యార్థులకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వాలు దృష్టి సారిస్తున్నాయని ఆచార్య శివరాంప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడలోని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీజీ మాట్లాడుతూ భారత్ వసుదైక కుటుంబం అనే సైదాంతికతో కొనసాగుతుందన్నారు. విద్యార్థులు తమ దృష్టిని లక్ష్యం దిశగా కేంద్రీకరించినప్పుడే అనుకున్న విజయాలను సాధిస్తారని చెప్పారు. మాజీ ఐపీఎస్ అధికారి, ప్రస్తుత పరిశ్రమల ప్రతినిధి సాంబశివరావు మాట్లాడుతూ నేడు చదువు,సంస్కారం రెండుగా విడిపోయాయని, దీనివల్ల సమాజంలో దుష్ఫలితాలు ఎదురవుతున్నాయన్నారు. విద్యార్థుల చదువు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని సూచించారు. అలాగే విద్యార్థులు పుస్తక పఠనంకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సాంబశివరావు పేర్కొన్నారు.

ఎల్ ఎల్ సి పరిశ్రమల ప్రతినిధి డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రయత్నం చేస్తామన్నారు. యూకే లోని ఎన్టీఆర్ బయో సెన్సర్స్ సీఈవో ఆండ్రియో గేర్ర మాట్లాడుతూ సమ్మేళనంతో విశ్వవిద్యాలయం,పరిశ్రమల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయన్నారు. ఇటలీకి చెందిన న్యూరో టెక్ ఫర్ రిహాబిలిటేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ మేనేజర్ క్లాడియో గబ్బియని, ఏఎన్యూ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, సంకేత్ ఫౌండేషన్ చైర్మన్ సాత్విక్, ఐసిఎఫ్ఏసి ప్రతినిధి రాకేష్ కుమార్ తదితరులు ప్రసంగించారు. అనంతరం రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్ అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమ్మేళనం కన్వీనర్ ఆచార్య పి. పద్మావతి,సంచాలకులు ఆచార్య లింగరాజు,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్,అడ్వైజరీ కమిటీ సభ్యులు,సోషల్ సైన్స్ డీన్,దూరవిద్య సంచాలకులు ఆచార్య వి. వెంకటేశ్వర్లు, అవగాహన ఒప్పందాల కమిటీ సభ్యులు, సిడిసి డీన్ ఆచార్య వి. రవికుమార్ తో పాటు అధ్యాపకులు,పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్సిటీ- పరిశ్రమల మధ్య 20 అవగాహన ఒప్పందాలు:సమ్మేళనంలో భాగంగా శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, వివిధ పరిశ్రమల ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందాలు జరిగాయని రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్, సమ్మేళనం కన్వీనర్ ఆచార్య పద్మావతి తెలిపారు. ప్రతిష్టాత్మక సంస్థలైన ఫినిక్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ డైరెక్టర్ చుక్కపల్లి రాకేష్, దుబాయ్ కు చెందిన ఎల్ ఎల్ సి కంపెనీ ప్రతినిధి డాక్టర్ రవికుమార్,సంకేతా ఫౌండేషన్ చైర్మన్ సాత్విక్, స్పేస్ ఐఎన్ఎఫ్ కంపెనీ ప్రతినిధులు డాక్టర్ మధుచంద్ర,డాక్టర్ శ్రీదేవి,రిజ్విన్ బయో మెడికల్,ఐటీ , ఎన్టీఆర్ బయో సెన్సార్స్ తో పాటు ఆయా పరిశ్రమల ప్రతినిధులు,ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్, కన్వీనర్ ఆచార్య పద్మావతి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంలు 20 అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు.

ఆకట్టుకున్న డ్రోన్ ప్రదర్శన:సమ్మేళనంలో భాగంగా శుక్రవారం విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో ఇండియా డ్రోన్ అకాడమీ నిర్వహించిన డ్రోన్ ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గంగాధరరావు,రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం తో పాటు విద్యార్థులు డ్రోన్ ప్రదర్శనను తిలకించారు. డ్రోన్ ప్రదర్శన పట్ల అధికారులు, విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపారు. అలాగే సమ్మేళనంలో భాగంగా శుక్రవారం కొత్తగా మరికొన్ని పరిశ్రమల ప్రతినిధులు వారి ఉత్పత్తులతో కూడిన స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. దీంతో విశ్వవిద్యాలయం నిర్దేశించిన స్టాల్స్ 50 కు చేరాయి. యూకే కు చెందిన లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థ విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు వెళ్లే విధానంపై అవగాహన కల్పించే స్టాల్స్ ను ఏర్పాటు చేయగా, మంగళగిరి కి చెందిన మాన్విక హ్యాండీక్రాఫ్స్ అండ్ స్పోర్ట్స్ మెమొంటోస్ స్టాల్స్ లో అద్భుతంగా ఆకట్టుకునే వస్తువులను ఏర్పాటు చేసింది.

ఏహెచ్ కెరీర్ అకాడమీ,పయనీర్,రైల్ టెల్, రిలయన్స్ ఫౌండేషన్ స్కిల్లింగ్ అకాడమీ, ఓంకార్స్,హ్యాబిట్స్,జిఎం సోలార్ సిస్టమ్స్, ఐఆర్ సిటిసి టూరిజం,కిమ్స్ శిఖర హాస్పిటల్స్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ విభాగం,కిసాన్ పరివార్,ఎస్ ఎం హాలిడే ప్లానర్స్, స్పేస్ టెక్నాలజీ,డ్రోన్ టెక్నాలజీ లాంటి పలు సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్ విద్యార్థులను ఎంతో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఆయా స్టాల్స్ ను సందర్శించి పరిశ్రమల్లో ఉద్యోగాల సాధనకు అవసరమైన నైపుణ్యాలపై అవగాహన తెచ్చుకున్నారు. రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్,రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం లు స్టాల్స్ ను సందర్శించారు. అలాగే ఆయా పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సాంకేతిక ప్రత్యేక ఉపన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సమ్మేళనం శనివారంతో ముగియనుంది. రెండు రోజుల నుంచి సమ్మేళనం విజయవంతంగా కొనసాగుతుందని రెక్టార్ ఆచార్యశివరాం ప్రసాద్,రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# వీరపాండ్య కట్టబొమ్మన పాత్రలో అదరగొట్టిన మంత్రి దుర్గేష్





- సాంస్కృతిక కార్యక్రమంలో అదరగొట్టిన పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి దుర్గేష్
- ముఖ్యమంత్రి, సహచర ప్రజాప్రతినిధుల ప్రశంసల జల్లు

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నిరంకుశత్వాన్ని ఎదిరించి, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో విప్లవ జ్యోతిగా వెలిగిన వీరపాండ్య కట్టబొమ్మన పాత్రలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ అద్భుత నటనతో అలరించారు. అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడిన అనంతరం, శుక్రవారం సాయంత్రం విజయవాడ పట్టణం పటమటలోని ఆంత్రలాక్స్ హాల్‌లో ప్రజాప్రతినిధుల కోసం ఆంధ్రప్రదేశ్ "శాసన వ్యవస్థ" ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆటవిడుపు"ఎమ్మెల్యే - ఎమ్మెల్సీ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు - 2026 కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ తనదైన శైలిలో ఈ ప్రదర్శన ఇచ్చారు. కట్టబొమ్మన విశిష్ట ఆహార్యం, గంభీరమైన వాచకం, రాజసంతో మంత్రి దుర్గేష్ ఆ పాత్రలో జీవించేశారు. ఆయన వేదికపైకి రాగానే సభలో చప్పట్ల వర్షం కురిసింది. ఈ ప్రదర్శనను వీక్షించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మరియు సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులు మంత్రి దుర్గేష్ నటనను వేనోళ్ల కొనియాడారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "దేశభక్తికి నిలువెత్తు రూపం వీరపాండ్య కట్టబొమ్మన అని, పాంచాలకురిచ్చి యుద్ధంలో ఆయన చూపిన సాహసం చిరస్మరణీయమని" కొనియాడారు. అటువంటి మహనీయుడి పాత్రను పోషించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మంత్రి కందుల దుర్గేష్ నటనా శైలి, సంభాషణల చాతుర్యం, పుణ్యభూమి నాదేశం నమోనమామి పాటలో ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, సునీల్ కుమార్ తదితర సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రదర్శించిన తీరు సభికులను మంత్రముగ్ధులను చేసింది.

# లిక్కర్ స్కాంలో భారీగా ఆస్తులు అటాచ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ లిక్కర్ స్కాంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో పలువురి నిందితుల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్యలకు సంబంధించిన రూ. 441 కోట్ల ఆస్తులను శుక్రవారం అటాచ్ చేసింది ఈడీ. ఈ మొత్తంలో స్థిర, చరాస్తులు ఉన్నాయి. షెల్ కంపెనీల ద్వారా రూ. 104 కోట్లు వీరు కొల్లగొట్టారంటూ ఈడీ వివరించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

అటాచ్ చేసిన జాబితాలో బ్యాంక్ బ్యాలెన్స్‌లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, భూములు ఉన్నాయి. ఇక కసిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థలకు చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. బూనేటి చాణక్యకి సంబంధించిన సంస్థల ఆస్తులను అటాచ్ చేసింది. దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థల ఆస్తులను అటాచ్ చేశారు.

అలాగే మనీ లాండరింగ్ కేసులో భాగంగా ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది. ్రమీూా 2002 కింద తాత్కాలికంగా ఈ ఆస్తులను అటాచ్ చేసింది. హైదరాబాద్ ఈడీ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ చర్యలు తీసుకుంది.

# ఉల్లాసంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక సంబరం









- ప్రజాప్రతినిధులు ఓ కుటుంబంలా కలిసి పనిచేయాలన్న సీఎం
- క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన నేతలకు బహుమతులు ప్రదానం చేసిన సీఎం చంద్రబాబు

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజాప్రతినిధుల మధ్య జరిగిన క్రీడా పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రొఫెషనల్స్‌కు ఏమాత్రం తీసిపోకుండా ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. వారిని చూస్తుంటే తనకు పాత రోజులు గుర్తొస్తున్నాయని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీకే పరిమితం కాకుండా ఆల్ రౌండర్లుగా నిలిచారని అన్నారు. విజయవాడలోని ఆంత్రా లక్స్ కన్వెన్షన్ లో శుక్రవారం నిర్వహించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం నాకు సంతోషంగా ఉంది. నేతల క్రీడల్లో చక్కగా రాణించారు. క్రీడోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడుని మనస్పూర్తిగా అభినందిస్తున్నాను. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎన్టీఆర్ పాత్రలో జీవించారు. నేతన్నలను ప్రోత్సహించేందుకు మహిళా ప్రజా ప్రతినిధులు చేనేత వస్త్రాలు ధరించి రావడం అభినందనీయం. ప్రతి ఒక్క నేత కలిసిమెలిసి కుటుంబంలా పనిచేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన సభ్యులకు ముఖ్యమంత్రి బహుమతులు అందజేశారు. అంతకుముందు "హు ఈజ్ హు" అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఏపీ శాసన మండలి సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. .

# నేడు ఢిల్లీలో రైసినా డైలాగ్ 2026 సదస్సుకు సీఎం చంద్రబాబు

- సాంకేతికత- సుపరిపాలనపై సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగం
- సదస్సులో పాల్గొననున్న 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం హాజరుకానున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో సాంకేతికత - సుపరిపాలన, భవిష్యత్ అంశాలపై సీఎం కీలక ఉపన్యాసం చేయనున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తున్నాయి. ఇందులో పాల్గొనేందుకు నేడు ఉదయం 10.50 గంటలకు సీఎం విజయవాడ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు తాజ్ ప్యాలెస్ లో జరిగే రైసినా డైలాగ్ 2026 సదస్సుకు ముఖ్యమంత్రి హాజరవుతారు. అనంతరం ఆయన అమరావతి తిరిగి రానున్నారు. 2016 నుంచి ఎంఓఈఏ- ఓఆర్ఎఫ్ సంస్థలు రైసినా డైలాగ్ పేరిట ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. ప్రపంచ రాజకీయాలు- అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ స్థాయిలో చర్చించే అత్యున్నత వేదికగా రైసినా డైలాగ్ సదస్సుకు మంచి పేరుంది. వివిధ దేశాల అధినేతలు, మంత్రులు, అత్యున్నత సైనిక అధికారులు, విధానకర్తలు, మేధావులు, నిపుణులు ఒకే వేదికపై గ్లోబల్ వ్యూహాలను చర్చించేలా ఈ సదస్సు జరగనుంది. అంతర్జాతీయంగా పేరొందిన మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్సు లాంటి ప్రతిష్టాత్మక వేదికల సరసన రైసినా డైలాగ్ నిలుస్తోంది. ఈ ఏడాది జరగనున్న 11వ ఎడిషన్ రైసినా డైలాగ్ సదస్సు సంస్కార- అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ రైసినా డైలాగ్ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారు. దేశంలో అభివృద్ధి పథాన నడుస్తున్న రాష్ట్రంగా ఏపీలో అమలు చేస్తున్న సుపరిపాలన- డిజిటల్ అంశాలపై ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత విధాన నిర్ణయాల ద్వారా ప్రజలకు అందుతున్న మెరుగైన పౌరసేవల గురించి ఈ సదస్సులో ప్రస్తావించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా మార్చేందుకు అనుసరిస్తున్న దార్శనిక నిర్ణయాలను ప్రపంచ దేశాల ముందు ఉంచనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎకోసిస్టమ్స్, డేటా సెంటర్లు, క్లీన్, గ్రీన్ ఎనర్జీ, నెక్ట్స్ జనరేషన్ టెక్నాలజీ కారిడార్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు. పాలనకు సాంకేతికతను జోడించి ఆర్థిక వృద్ధిని ఎలా వేగవంతం చేయవచ్చన్న అంశాలతో పాటు పాలనలో పారదర్శకత, సంపద సృష్టి, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ వంటి వినూత్న అంశాలపై అంతర్జాతీయ ప్రతినిధులతో తన అనుభవాలను ముఖ్యమంత్రి పంచుకోనున్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోండి

- సామాజికంగా, ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందాలి
- ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ
- ఎస్ఆర్ఎం వర్సిటీలో ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వం అమలు పరుస్తోన్న వివిధ మహిళా సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలనీ, సామాజికంగా, ఆర్థికంగా మహిళలు గణనీయమైన అభివృద్ధి సాధించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ అభిలషించారు. శుక్రవారం సాయంత్రం ఏపీ ఎస్ఆర్ఎం యూనవర్సిటీలో జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవ కార్యక్రమానికి డాక్టర్ శైలజ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. యూనివర్శిటీ ఉప కులపతి ఆచార్య సిహెచ్ సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన మహిళా సదస్సులో ఆమె ప్రసంగించారు. గృహహింస, లైంగిక వేధింపుల వంటి మహిళా భద్రత చట్టాలపై కూడా అవగాహన పెరగాల్సి ఉందని, ఇందుకోసం మహిళా కమిషన్ కృషి చేస్తుందన్నారు. మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాల్సి ఉందని, గ్రామీణ మహిళలు స్వయం సమృద్ధిని సాధించుకునే దిశగా అడుగులు వేయాలని పిలుపుచ్చారు. ఏటా ఎస్ఆర్ఎం వర్సిటీ మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం హర్షణీయమని డాక్టర్ శైలజ ప్రశంసించారు. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ, వర్సిటీలో మహిళల కోసం ప్రత్యేకంగా ఉమెన్ సెల్ ఏర్పాటు చేశామని, వారి హక్కులను కాపాడేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. పిల్లల్ని పెంచే విషయంలో ఆడ, మగ అన్న వ్యత్యాసం లేకుండా ఇద్దర్నీ సమానంగా చూడాలని మహిళలకు సూచించారు. ఈ వేడుకలకు విశిష్ట అతిధులుగా హాజరైన ఎన్ సీ సీ ఆఫీసర్ మేజర్ అవినాషి పాత్వాల్, పారిశ్రామికవేత్త ఇందు ఎస్ మేన్నన్లు కూడా ప్రసంగించారు.

**10 మంది మహిళా ఉద్యోగులకు అవార్డులు**

ఈ సందర్భంగా యూనివర్సిటిలో పనిచేస్తున్న 10 మంది మహిళా ఉద్యోగులకు డాక్టర్ వివిఎస్ రావు ఫౌండేషన్ ద్వారా ఉత్తమ మహిళా ప్రతిభా ఆవార్డులను ప్రకటించారు. ఈ ఆవార్డుల కింద ఒక్కో మహిళకు రూ. 2000 నగదు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ అవార్డులు అందుకున్న వారిలో రత్నకుమారి , మహాలక్ష్మి, పట్టెమ్మ, ఆరుణ, రాణి, విజయలక్ష్మి, జానికి, త్రివేణి , అగ్నిసమ్మలు ఉన్నారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలైన మహిళా ఉద్యోగులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. విద్యార్థులతో పాటు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత ప్రదర్శించిన అఖిలాండేశ్వరి నృత్యప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, డిన్ సీ వీ టమి , రేవతి , డైరెక్టర్లు అనూప్ సింగ్, ఐజక్ సామల తదితరులు పాల్గొన్నారు.

# కాపుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే



- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని, ఆయన హయాంలోనే కాపులకు మేలు కలిగేలా పథకాలు అమలవుతున్నాయని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత స్పష్టం చేశారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె స్పందిస్తూ, కాపుల సంక్షేమానికి ఏటా బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. 2014-19 మధ్య విదేశీ విద్య కింద 1585 మంది కాపు విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించామన్నారు. ఆ 5 ఏళ్లలో రూ. 153.11 కోట్లు కేటాయించామని, గత వైసీపీ ప్రభుత్వం కేవలం 81 మంది కాపు విద్యార్థులకు మాత్రమే విదేశీ విద్యా పథకం వర్తింప జేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత 331 మంది కాపు విద్యార్థులకు విదేశీ విద్యా పథకం బకాయిలు అందజేశామన్నారు. 2024-25లో కాపు సంక్షేమానికి రూ. 4,440.25 కోట్లు ఖర్చు చేశామని, 2025-26లో కాపులకు రూ. 5,571.48 కోట్లు కేటాయించామని తెలిపారు. 2014-19లో సీఎం చంద్రబాబు... కాపు భవనాల నిర్మాణాలకు నిధులిచ్చారని, తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాపు భవనాల నిర్మాణాలను పున:ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వం కాపుల కోసం ఏడాదికి రూ. 3,580 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు.

**కాపుల అభివృద్ధికి కూటమి కృషి**

కాపుల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తోందని మంత్రి సవిత తెలిపారు. రూ. 38.63 కోట్లతో ఆటో డ్రైవర్ల సేవా పథకం అమలు చేశామని, ఈ పథకం కింద 25,756 మంది కాపు లబ్ధిదారులకు ప్రయోజనం కలిగిందని తెలిపారు. సముద్రంలో చేపల వేట నిషేధం భృతి పథకం కింద రూ. 1.02 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ పథకం ద్వారా 511 మంది కాపులకు లబ్ధి కలిగిందన్నారు. మెగా డీఎస్సీ ఆన్ లైన్ కోచింగ్ ప్రోగ్రాం ద్వారా 639 మంది కాపు అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందివ్వగా, 54 కాపు అభ్యర్థులు టీచర్ ఉద్యోగాలు సాధించారన్నారు. కాపు నిరుద్యోగ యువతకు 50 శాతం సబ్సిడీపై రాయితీ రుణాలు అందించడానికి 2025-26 బడ్జెట్‌లో రూ. 217.79 కోట్ల కేటాయించామన్నారు. చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద 10,300 మంది కాపు లబ్ధిదారులను, గ్రూప్ ఎంఎస్ఎంఈ పథకం ద్వారా 130 గ్రూపులను గుర్తించామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి పథకం కింద 11,016 మంది కాపు మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ అందజేశామని మంత్రి సవిత తెలిపారు.

# నాణ్యమైన విద్య లక్ష్యంగా విజ్ఞాన విహార పాఠశాల



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నగరంలోని సంపత్ నగర్‌లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా స్థాపించనున్న విజ్ఞాన విహార పాఠశాలకు భూమిపూజ కార్యక్రమం జరిగింది. పాఠశాల చైర్మన్ డాక్టర్ వి. రఘురామ్ రెడ్డి, కార్యదర్శి ఎ. వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ ప్రచారక్ విజయ ఆదిత్య, సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన్, ప్రాంత సహ కార్యవాహ్ యుగంధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక అభ్యాస విధానాలతో పాటు విలువల ఆధారిత విద్య అందించడం ద్వారా భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోగల విద్యార్థులను తీర్చిదిద్దడం అవసరమని అన్నారు. విద్యా నైపుణ్యం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, 21వ శతాబ్దపు నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పాఠశాల యాజమాన్యం తెలిపింది. సాంస్కృతిక విలువలను పరిరక్షిస్తూ ప్రపంచ స్థాయిలో పోటీపడగల విద్యార్థులను తయారు చేయడం ఈ విద్యాసంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంపత్ నగర్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. పాఠశాల 2027--28 విద్యా సంవత్సరంలో ప్రారంభం కావచ్చని యాజమాన్యం వెల్లడించింది.

# వెండితెరపై 'ఆంధ్ర' కళా వైభవం.. ఏపీ సినిమాటోగ్రఫీలో నవశకం

ఒకప్పుడు తెలుగు సినిమా అంటే మద్రాసు.. ఆ తర్వాత హైదరాబాద్. కానీ ప్రకృతి ఒడిలో పరవశించే సహజసిద్ధమైన అందాలు, అపారమైన ప్రతిభ ఉన్న ఆంధ్రప్రదేశ్ గడ్డ ఇప్పుడు టాలీవుడ్‌కు అసలైన 'కేరాఫ్ అడ్రస్'గా మారుతోంది. గత 20 నెలలుగా సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ నాయకత్వంలో జరుగుతున్న సంస్కరణలు చూస్తుంటే ఏపీ త్వరలోనే క్రియేటివ్ ఇండస్ట్రీ హబ్‌గా అవతరించడం ఖాయమనిపిస్తోంది.

**ప్రకృతి అందాలకు తోడైన కూటమి ప్రభుత్వ సంకల్పం**

కోనసీమ కొబ్బరి తోటలు, అరకు కాఫీ తోటలు, లోతైన లోయలు, అబ్బురపరిచే బొర్రా గుహలు, ఆహ్లాదపరిచే మారేడుమిల్లి అడవి అందాలు, దట్టమైన మడ అడవులు, గండికోట శిల్పకళా సౌందర్యం, హార్సిలీహిల్స్ లాంటి కొండ శిఖరాలు, ఔరా అనిపించే విశాఖ, సూర్యలంక తీర ప్రాంతాలు, ప్రఖ్యాతి గాంచిన పుణ్యక్షేత్రాలు, చరిత్రకెక్కిన చారిత్రక కట్టడాలు, ఒంపు సొంపులు తిరిగిన ఘాట్ రోడ్లు, అక్కడే ఉండిపోవాలనిపించే జలపాతాలు... ఇలా ఏపీలో లొకేషన్లకు కొదవలేదు. అయితే, కేవలం లొకేషన్లు ఉంటే సరిపోదు.. వాటిని వాడుకునేలా చిత్ర పరిశ్రమను ప్రోత్సహించే 'సినిమా ఫ్రెండ్లీ' వాతావరణం కావాలి. షూటింగ్ జరిగే ప్రాంతాల అసలు పేర్లను తెరపై టెక్ట్స్ రూపంలో ప్రదర్శించాలన్న మంత్రి కందుల దుర్గేష్ ఆలోచన పర్యాటక రంగాన్ని, సినిమా రంగాన్ని అనుసంధానించే అద్భుతమైన మార్పు. దీనివల్ల పర్యాటకులు ఆయా ప్రాంతాలకు క్యూ కట్టే అవకాశం ఉంది.

**కీలక సంస్కరణలు - భరోసా ఇచ్చే పాలసీలు**

కూటమి ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణాత్మక అడుగులు వేస్తోంది.. నూతన ఫిల్మ్ పాలసీలో భాగంగా స్టూడియోల నిర్మాణం, డబ్బింగ్, రీ-రికార్డింగ్ థియేటర్ల ఏర్పాటుకు రాయితీలు ఇవ్వడం ద్వారా పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఏపీని కేంద్రంగా మార్చే ప్రయత్నం ప్రశంసనీయం. సింగిల్ విండో విధానం ద్వారా ఏపీలో జరిగే షూటింగ్‌లకు ఉచిత అనుమతులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం వల్ల చిన్న చిత్రాల నిర్మాతలకు పెద్ద ఊరట లభిస్తుంది. అదే విధంగా 100 శాతం ఏపీలోనే షూటింగ్ జరుపుకునే చిత్రాలకు ఇచ్చే నగదు సబ్సిడీ, లో-బడ్జెట్ సినిమాలకు జీఎస్టీ మినహాయింపు వంటి నిర్ణయాలు పరిశ్రమను పరుగులు పెట్టిస్తాయనడంలో అతిశయోక్తి లేదు. అంతేగాక సినిమా టికెట్ ధరల విషయంలో ఉన్న అయోమయాన్ని తొలగించడానికి సింగిల్ జీవో విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల నిర్మాతలకు, ఎగ్జిబిటర్లకు మరియు సామాన్య ప్రేక్షకులకు సమతుల్యత ఏర్పడుతుందని భావిస్తోంది. ఇప్పటికే రెండు మూడు పర్యాయాలు సినిమా, టీవీ ఆర్టిస్టులతో భేటీ అయి ప్రభుత్వ ఉద్దేశాన్ని చెప్పి వారిని ఏపీకి రప్పించేందుకు మంత్రి కందుల దుర్గేష్ చేస్తున్న ప్రయత్నం కొనియాడదగినది. ఫిల్మ్ టూరిజం పాలసీలో భాగంగా పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు, షూటింగ్ లకు అనువైన లొకేషన్ల గుర్తింపు, ప్రసిద్ధ షూటింగ్ స్పాట్ లను టూరిజం ప్యాకేజీలతో అనుసంధానించడం, ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహణ, ఫిల్మ్ టూరిజం సర్క్యూట్ ల అభివృద్ధి, సింగిల్ విండో ఏర్పాటు ద్వారా ఫిల్మ్ పర్మిట్ల కోసం క్లియరెన్స్ సిస్టమ్ వంటి వినూత్న నిర్ణయాలతో ఫిల్మ్ మేకర్స్ ను కూటమి ప్రభుత్వం ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది.

**కళాకారులకు గౌరవం.. సాంస్కృతిక పునరుజ్జీవం**

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నంది అవార్డులు, టీవీ అవార్డులను 2026లో అందించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం కళాకారులలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అలాగే, నాటక రంగాన్ని ఆదుకుంటూ ఏప్రిల్ 16న ప్రముఖ సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకొని తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా కందుకూరి పురస్కారాలను అందించడం ప్రభుత్వానికి సంస్కృతి పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనం. 24 క్రాఫ్ట్స్ కళాకారుల కోసం 'డేటా బ్యాంక్' ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక ప్రతిభకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్న మంత్రి దుర్గేష్ ఆలోచనకు హ్యాట్సాఫ్.. ఈ దిశగా ఆయన చేస్తున్న ప్రయత్నం కళాకారులకు ఉపాధి కల్పించేందుకు దోహదపడుతుంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫిల్మ్ ఇన్ స్టిట్యూట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తద్వారా కళాకారులుగా ఎదిగేందుకు యువతకు అవకాశం దక్కుతుంది. ప్రధానంగా ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల మీద డాక్యుమెంటరీలు, న్యూస్ రీల్స్ నిర్మించి అన్ని సినిమా థియేటర్లలో ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులకు సామాజిక అవగాహన కల్పిస్తోంది మంత్రి దుర్గేష్ నేతృత్వంలోని సినిమాటోగ్రఫీ శాఖ..

**ట్రాన్స్ మీడియా సిటీ..భవిష్యత్తు వైపు అడుగు**

దేశంలోనే మొదటిసారిగా వందలాది కోట్లతో ఏర్పాటు చేయనున్న 'ట్రాన్స్ మీడియా ఎంటర్ టైన్ మెంట్ సిటీ' ఏపీ ముఖచిత్రాన్ని మార్చేయనుంది. థీమ్ పార్కులు, గేమింగ్ జోన్లతో ఇది కేవలం సినిమా షూటింగ్‌లకే కాకుండా, డిజిటల్ ఆవిష్కరణలకు కూడా వేదికగా నిలుస్తుంది. ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో సినిమాటోగ్రఫీ శకటానికి మొదటి బహుమతి లభించడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం.. ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర టివి మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ నుండి మొట్టమొదటి సారిగా "ది హీయర్ బీట్ ఆఫ్ ఇండియన్ సినిమా అండ్ టూరిజమ్" థీమ్ తో ప్రత్యేక శకటం ఏర్పాటు చేసి 20 మంది డూప్ లైవ్ నటీనటులతో ప్రత్యేక ఆకర్షణతో పెరేడ్ లో కనువిందు చేయడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచింది.

**భవిష్యత్ కార్యాచరణ...**

ఎన్నో పోరాటాల తర్వాత 1975లో తెలుగు చలన చిత్ర పరిశ్రమ హైదరాబాద్ కు రావడం అనంతరం రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థగా ఎఫ్ డీసీ ఏర్పడి తనదైన ముద్ర వేయడం జరిగింది.. ఆ సమయంలో సినిమా పరిశ్రమకు భూములు, ఇతర మౌలిక వసతులు కల్పించడం, సినిమాలకు 2 - 10 లక్షల వరకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వడం, థియేటర్స్ కు లోన్ లు మంజూరు చేయడం, ట్యాక్స్ ల మినహాయింపు వంటివి ఉమ్మడి ఏపీలో అందించడం జరిగింది. తద్వారా తెలుగు సినిమా పరిశ్రమ దిన దిన ప్రవర్ధమానం అయింది. అదే విధంగా ఇప్పుడు నవ్యాంధ్ర ప్రదేశ్ లో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి విశాఖ, విజయవాడ, తిరుపతి ప్రాంతీయ కేంద్రాలుగా సినిమా స్టూడియోలు ఏర్పాటుకు నాంది పలకాల్సిన అవసరం ఉంది. అదే విధంగా స్థానికంగా సినిమా నిర్మాణం చేసేవారికి మరిన్ని రాయితీలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇండోర్, అవుట్‌డోర్ యూనిట్లు ఏర్పాటు చేసి షూటింగ్‌లకు ఇస్తే మరింత బాగుంటుంది.. వేలాది మంది కళాకారులు తయారై, ఉపాధి కలిగేలా ఆంధ్రప్రదేశ్ లో ఫిల్మ్, టెలివిజన్ ఇన్ స్టిట్యూట్ పై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.. ప్రస్తుతం పీపీపీ మోడల్ లో ప్రయోగాత్మకంగా విశాఖపట్టణంలో ఈ ఇన్ స్టిట్యూట్ ను మొదలుపెట్టి ముందుకు తీసుకుపోతే బాగుంటుంది. సింగిల్ విండో విధానం ద్వారా సినిమా థియేటర్లకు ఫారం-బి ని రెన్యువల్ చేసుకునేందుకు నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్లు, లైసెన్స్ ఇవ్వాల్సి ఉంది.. సినిమాటోగ్రఫీ చట్టానికనుగుణంగా రాష్ట్రంలోని సినిమా థియేటర్లు, ఆర్టిస్టుల సంక్షేమం విషయంలో చర్యలు తీసుకోవాలి.. భవిష్యత్తులో అమరావతి కూడా ప్రభావం చూపించే స్థాయికి సినిమా రంగం ఎదిగేందుకు కృషి చేయాలి.. అదే సమయంలో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కిన నేపథ్యంలో సామాన్యుడికి సినిమాను చేరువ చేయాల్సిన బాధ్యతను మంత్రి దుర్గేష్ తీసుకొని ఆ దిశగా పాటుపడుతున్నారు. ఇందుకు ఎఫ్ డీసీ ఎండీగా విశ్వనాథన్ అందిస్తున్న సహకారం ప్రశంసించదగినది..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్, స్వయంగా కళాకారుడైన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యవేక్షణ, మంత్రి కందుల దుర్గేష్ కృషితో ఏపీలో సినిమా రంగం మళ్లీ కళకళలాడనుంది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహకాలను చిత్ర పరిశ్రమ అందిపుచ్చుకుంటే.. ఏపీ కేవలం షూటింగ్ స్పాట్ మాత్రమే కాదు, గ్లోబల్ సినిమా ప్రొడక్షన్ హబ్‌గా మారుతుందనడంలో సందేహం లేదు. ఏదేమైనా ఆంధ్రప్రదేశ్ సినిమాలు తీయడానికి అత్యుత్తమమైన వేదిక అని నిస్సందేహంగా చెప్పవచ్చు..



**పెంటమరాజు గోపాల్ రావు**
పీఆర్వో, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు
కాంటాక్ట్: 9494273373

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467